VELTHURU TELUGU DAILY

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ :సోమవారం 28.09.2026

సంపుటి : 09 సంచిక : 106, పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

ఉల్లాస్ పరీక్ష రాస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు మంత్రి సీతక్క అభినందనలు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

2

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27: నార్సింగిలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పట్టభద్రుల సమ్మేళనం–2026" కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై హైదరా బాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఓటరుకార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు.

▶ మిగతా2లో

భవిష్యత్ ప్రధానిగా రాహుల్ వైపే దేశం చూపు

- రాజ్యాంగాన్ని రక్షించే శక్తి... ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ధైర్యం కాంగ్రెస్‌కే సొంతం
- నియంతృత్వ రాజకీయాలపై రాహుల్‌ది రాజీలేని పోరాటం
- ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ
- తెలంగాణలోని ప్రతి లోక్‌సభ స్థానాన్ని గెలిచి రాహుల్‌ను ప్రధానిని చేద్దాం
- కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపు

11

నేరేడుచర్ల, వెలుతురు సెప్టెంబర్ 27: భారత రాజ్యాంగానికి రక్షణ కవచంగా, ప్రజాస్వామ్యానికి ఆశాకిరణంగా నిలుస్తున్న రాహుల్‌గాంధీని భవిష్యత్ ప్రధానమంత్రిగా స్వాగతించేందుకు దేశం సిద్ధమవుతోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. అధికార అహంకారానికి ఎదురొడ్డి నిలిచే ధైర్యం, ప్రజల పక్షాన పోరాడే నిబద్ధత, రాజ్యాంగ విలువలను కాపాడే దృఢ సంకల్పం రాహుల్‌గాంధీలోనే దేశ ప్రజలు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు. భారతదేశం ప్రస్తుతం కేవలం రాజకీయ మార్పును మాత్రమే కాదు–రాజ్యాంగబద్ధమైన,ప్రజాస్వామ్యయుతమైన, ప్రజల గొంతును గౌరవించే నాయకత్వాన్ని కోరుకుంటోందన్నారు. ఆ ఆకాంక్షకు ప్రతిరూపంగా రాహుల్‌గాంధీ ఎదిగారని చెప్పారు."దేశ ప్రజల చూపు ఇప్పుడు రాహుల్‌గాంధీ వైపే ఉంది. అధికారాన్ని అనుభవించేందుకు కాదు—ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, దేశాన్ని ఐక్యంగా ముందుకు నడిపించేందుకు ఆయన ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. భారతదేశ తదుపరి ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీని చూడాలన్న ఆకాంక్ష దేశవ్యాప్తంగా ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గత పదేళ్లకు పైగా రాహుల్‌గాంధీపై రాజకీయ దాడులు, వ్యక్తిత్వ హనన ప్రయత్నాలు, అణచివేత చర్యలు కొనసాగుతున్నప్పటికీ ఆయన ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదన్నారు.

తెలంగాణ పర్యాటకానికి డిజిటల్ హంగులు

- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం
- కొత్త టూరిజం వెబ్‌సైట్ ఆవిష్కరణ.. ఆన్‌లైన్‌లో హోమ్‌స్టే రిజిస్ట్రేషన్
- 360 డిగ్రీల సాంకేతికతతో గైడ్‌ల శిక్షణ
- 'మై తెలంగాణ.. మై డెస్టినేషన్' డిజిటల్ ప్రచారం

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ పర్యాటక శాఖ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పర్యాటక సమాచారాన్ని మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సాంకేతికతను వినియోగించి సందర్శకుల అనుభవాలను మెరుగుపరిచేలా కొత్త కార్యక్రమాలను ప్రారంభించింది.

▶ మిగతా2లో

"మేము ఓట్లను చోరీ చేయం.. ప్రజల మనసులను గెలుచుకుంటాం"

- ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలు, రాజ్యాంగ వ్యవస్థలపై బురదజల్లడం కాంగ్రెస్ నైజం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27: "మిస్టర్ రాహుల్ గాంధీ.. భారతీయ జనతా పార్టీ ఎన్నడూ ఓట్లను చోరీ చేయదు, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుంది. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు, ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రజలు ఛీత్కరించుకుంటున్నా కాంగ్రెస్ వైఖరిలో మార్పు రావడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు.

తొలుత భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయినందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి, పోలీస్, మున్సిపల్ సిబ్బందికి, ప్రభుత్వ యంత్రాంగానికి, సహకరించిన నగర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

▶ మిగతా 11లో

కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ULC దరఖాస్తులకు మోక్షం

- అర్హత ఉన్న కేసులను పరిశీలించి క్రమబద్ధీకరించాలని ఆదేశాలు
- 22A చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుతున్న ప్రజా ప్రభుత్వం
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలకు కార్యరూపం
- ఇప్పటికే మూడు కీలక నిర్ణయాలు
- తాజాగా ULCపై స్పష్టమైన ఉత్తర్వులు
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

సీఈసీని కాపాడటం కాదు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- సీఈసీని సమర్థించడం కాదు-ఆయన నుంచి సమాధానాలు కోరాలి
- రాహుల్ గాంధీ పోరాటం పదవుల కోసం కాదు... ప్రతి భారతీయుడి ఓటు కోసం
- ఓటు హక్కుపై దాడి అంటే రాజ్యాంగం గుండెపై దాడే
- బీజేపీ రాజకీయ కవచం సీఈసీ విశ్వసనీయతను కాపాడలేదు

2

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

సీఈసీని కాపాడటం కాదు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- ప్రశ్నలకు సమాధానం చెప్పి విశ్వాసాన్ని నిలబెట్టాలి... లేదంటే రాజీనామా చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలిపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు ఆయన తరఫున బీజేపీ నాయకులు రాజకీయ వకాల్తా పుచ్చుకోవడం మానుకుని, దేశ ప్రజలకు సమాధానాలు చెప్పాలని ఆయననే కోరాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు."సీఈసీ బీజేపీ నాయకుడు కాదు. ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ సంస్థ కాదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తికి రాజకీయ పార్టీ కవచం అవసరం లేదు. ప్రజల విశ్వాసమే ఆయనకు రక్షణగా ఉండాలి. ఆ విశ్వాసం ప్రశ్నార్థకమైనప్పుడు బీజేపీ ప్రశంసలు కాదు—సీఈసీ సమాధానాలే దేశానికి కావాలి" అని అన్నారు.ఈ మేరకు ఆదివారం రోజున ఆయన హైదరాబాద్ లో విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర ఎన్నికల సంఘానికి మద్దతుగా బిజెపి వకాల్తా పుచ్చుకోవడంపై మండిపడ్డారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ఏ వ్యక్తిపైనా, ఏ ఒక్క సంస్థపైనా కక్షతో చేస్తున్న పోరాటం కాదన్నారు. రాజ్యాంగం ప్రతి భారతీయుడికీ ఇచ్చిన ఓటు హక్కును కాపాడేందుకు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు సాగుతున్న అంకితభావంతో కూడిన ఉద్యమమని పేర్కొన్నారు."రాహుల్ గాంధీ పోరాటం అధికారం కోసం కాదు... ప్రజల ఓటుకు అధికారం ఉండాలని. పదవి కోసం కాదు... పౌరుడి హక్కుకు రక్షణ ఉండాలని. బ్యాలెట్ పెట్టెను గెలుచుకోవడం కోసం కాదు... బ్యాలెట్ వేసే ప్రతి చేతి హక్కును కాపాడటం కోసం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించడం దేశంపై దాడి కాదని, రాజ్యాంగ సంస్థల జవాబుదారీతనాన్ని కోరడమే నిజమైన దేశభక్తి అని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిపై పరిశీలనను దేశంపై దాడిగా చిత్రీకరించే ప్రయత్నాన్ని బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. "ప్రశ్న అడిగితే కుట్ర అంటారు... సమాధానం కోరితే దేశద్రోహం అంటారు... బాధ్యత అడిగితే సంస్థపై దాడి అంటారు. ఇదే బీజేపీ రాజకీయ విధానం. కానీ ప్రజాస్వామ్యంలో ప్రశ్న నేరం కాదు. సమాధానం చెప్పకుండా తప్పించుకోవడమే ప్రజల విశ్వాసానికి ద్రోహం" అని వ్యాఖ్యానించారు. పత్రాల ఆధారంగా వెలువడిన మీడియా కథనాల ప్రకారం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల్లో కనీసం 14 అభ్యంతరాలు నమోదు చేసినట్లు తెలుస్తోందన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం–6లో మార్పులు, ఓటర్ల జాబితా డేటాబేస్‌పై కేంద్రీకృత నియంత్రణ, పేర్ల చేర్పులు—తొలగింపులు, పునరుద్ధరణ, అప్పీళ్ల నిర్వహణ, సాఫ్ట్‌వేర్ అందుబాటు వంటి కీలకమైన అంశాలు ఈ అభ్యంతరాల్లో ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయని చెప్పారు. మరోవైపు, నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం చెబుతోందన్నారు. ఈ రెండు వాదనల మధ్య ఉన్న వైరుధ్యాన్ని సాధారణ ప్రకటనతో పక్కన పెట్టలేరని స్పష్టం చేశారు. "అన్నీ ఏకగ్రీవ నిర్ణయాలే అయితే ఇద్దరు కమిషనర్లు 14 సార్లు అభ్యంతరాలు ఎందుకు నమోదు చేశారు? ఆ నోట్లు ఎవరి వద్దకు వెళ్లాయి? వాటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? వారి అభ్యంతరాలను పరిష్కరించారా? లేక పక్కన పెట్టారా? 'ఏకగ్రీవం' అనే ఒక్క పదంతో 14 అభ్యంతరాలను చెరిపేయలేరు" అని ప్రశ్నించారు. ఈ అంశాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైనట్లు వార్తలు వచ్చాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలు ప్రస్తుతం ఆరోపణలు మాత్రమేనని, న్యాయపరమైన విచారణకు ముందే వాటిని నిర్ధారిత వాస్తవాలుగా ప్రకటించకూడదని స్పష్టం చేశారు. "ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదనడం సరైనదే. కానీ అందువల్ల సమాధానం చెప్పాల్సిన బాధ్యత పోదు. విషయం కోర్టులో ఉందని చెప్పి ప్రజలకు వివరణ ఇవ్వకుండా తప్పించుకోలేరు. న్యాయస్థానం తన పని చేస్తుంది. రాజ్యాంగ సంస్థ ప్రజల పట్ల తన బాధ్యతను నిర్వర్తించాలి" అని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో, దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులను ఎవరు ఆమోదించారు? ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలకు ఏమని సమాధానమిచ్చారు? రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఓటరు డేటాబేస్‌పై ఎంతవరకు అధికారం ఉంది? అర్హులైన పౌరుల పేర్లు పొరపాటున తొలగించబడకుండా ఎలాంటి రక్షణలు కల్పించారు? అనే ప్రశ్నలకు సీఈసీ ఆధారాలతో కూడిన సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. "ఓటరు పేరు కంప్యూటర్ తెరపై కనిపించే ఒక వరుస కాదు... రాజ్యాంగంలో పౌరుడికి ఉన్న స్థానం. సాఫ్ట్‌వేర్‌లో జరిగిన పొరపాటుతో ఆ పేరు తొలగిపోతే దానిని కేవలం 'టెక్నికల్ గ్లిచ్' అని కొట్టిపారేయలేం. అది ఒక భారతీయుడి ప్రజాస్వామ్య హక్కుకు తగిలిన గాయం" అని వ్యాఖ్యానించారు. పేదలు, వలస కార్మికులు, యువ ఓటర్లు, మహిళలు, వృద్ధులు, అవసరమైన పత్రాలను సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పౌరులు పరిపాలనా లేదా సాంకేతిక లోపాలకు మూల్యం చెల్లించకూడదన్నారు. "అధికారికి జరిగిన తప్పు వల్ల పౌరుడి ఓటు పోకూడదు. సాఫ్ట్‌వేర్ వైఫల్యానికి సామాన్యుడు శిక్ష అనుభవించకూడదు. ఒక అర్హుడి పేరు జాబితా నుంచి తొలగితే అది ఒక పేరు పోవడం కాదు–ప్రజాస్వామ్యం నుంచి ఒక గొంతును తొలగించడం" అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్పష్టమైన విధానాలను ప్రకటించాలని, తన నిర్ణయాలకు ఉన్న చట్టపరమైన ఆధారాలను వెల్లడించాలని, పేరు తొలగింపుపై ప్రతి అర్హుడికీ సులభమైన, సమర్థవంతమైన అప్పీల్ అవకాశం కల్పించాలని కోరారు. ఓటింగ్ తేదీ దాటిన తర్వాత పేరు పునరుద్ధరించడం వల్ల ప్రయోజనం ఉండదని, ఎన్నికలకు ముందే తప్పులను సరిచేసే వ్యవస్థ ఉండాలని సూచించారు. సీఈసీ కుమార్తె, గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్‌కు సంబంధించిన కేసుపైనా కొన్ని ప్రశ్నలు చర్చకు వచ్చాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ భద్రతా చట్టం కింద ఒక యువతిని నిర్బంధించిన వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును మేధా రూపమ్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేశాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనం పరిధి, కేసును విచారణకు జాబితా చేసిన విధానం, ధర్మాసనానికి కేటాయింపుపై ఒక న్యాయవాదుల సంఘం ప్రశ్నలు లేవనెత్తినట్లు వార్తలు వచ్చాయని చెప్పారు. "ఆ కేసు మంచి చెడులపై నేను తీర్పు చెప్పడం లేదు. సీఈసీ జోక్యం చేసుకున్నారని ఆరోపించడం లేదు. ఆ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు స్వతంత్రంగా పరిశీలించాలి. అయితే విధివిధానాలు, ఔచిత్యంపై సందేహాలు వచ్చినప్పుడు పారదర్శక వివరణ ఇవ్వడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని స్పష్టం చేశారు. తాను ఎనిమిది ఎన్నికల్లో పోటీ చేసి ఏడింటిలో ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించానని, తన భార్య నాలుగు ఎన్నికల్లో పోటీ చేసి రెండింటిలో గెలిచారని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. తమ జీవితమంతా ప్రజాసేవలోనే గడిచిందని, క్షేత్రస్థాయిలో ఒక్క ఓటుకు ఉన్న విలువ తమకు తెలుసని చెప్పారు.

"ఒక్క ఓటు అభ్యర్థి భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు... ఒక నియోజకవర్గ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఒక ఓటరు పేరు తొలగిపోవడం అంటే ఒక అంకె తగ్గడం కాదు... ప్రజాస్వామ్యంలో ఒక పౌరుడి స్వరం మూగబోవడం" అని వ్యాఖ్యానించారు. ఇది కాంగ్రెస్—బీజేపీ మధ్య రాజకీయ వివాదం మాత్రమే కాదని, ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియను దేశ ప్రజలు విశ్వసించగలరా లేదా అన్నదే అసలు ప్రశ్నని అన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, అన్ని రాజకీయ పార్టీల పట్ల సమాన వైఖరి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కుకు భరోసా–ఈ మూడు సూత్రాలపైనే భారత ఎన్నికల వ్యవస్థ నిలబడుతుందని పేర్కొన్నారు. సీఈసీతోపాటు మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ప్రజల ముందున్న నిర్దిష్ట ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతర్గత అభ్యంతరాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలు, ఓటర్ల జాబితాల సాఫ్ట్‌వేర్‌లో చేసిన మార్పులు, వాటికి ఉన్న చట్టపరమైన ఆధారాలను సాధ్యమైనంత పారదర్శకంగా దేశ ప్రజల ముందుంచాలని కోరారు. "సీఈసీని బీజేపీ సమర్థిస్తే సందేహాలు తొలగవు. ఆయన స్వయంగా సమాధానం చెబితేనే విశ్వాసం నిలుస్తుంది. రాజకీయ ప్రకటనలు రాజ్యాంగ సంస్థకు విశ్వసనీయతను ఇవ్వలేవు. నిజాలు, ఆధారాలు, పారదర్శకత మాత్రమే ఆ విశ్వాసాన్ని పునరుద్ధరించగలవు" అని స్పష్టం చేశారు. సమగ్రమైన, విశ్వసనీయమైన వివరణతో ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందలేకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వమే ఆయనను పదవి నుంచి తప్పుకోవాలని కోరాలన్నారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పోరాటాన్ని కొనసాగిస్తుందని ప్రకటించారు. "మా పోరాటం ఒక వ్యక్తికి వ్యతిరేకంగా కాదు... వ్యవస్థలో పారదర్శకత కోసం. మా పోరాటం ఒక పదవి కోసం కాదు... ప్రతి పౌరుడి ఓటు కోసం. మా పోరాటం ఒక ఎన్నిక కోసం కాదు... భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. "ఓటును కాపాడితేనే రాజ్యాంగం నిలుస్తుంది. రాజ్యాంగం నిలిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నం జరిగినా రాహుల్ గాంధీ వెనక్కి తగ్గరు... కాంగ్రెస్ పార్టీ తలవంచదు... మేము మౌనంగా ఉండం" అని ఆయన తేల్చిచెప్పారు.

తెలంగాణ పర్యాటకానికి డిజిటల్ హంగులు

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబరు 27:

కొత్త వెబ్‌సైట్ ప్రారంభం

తెలంగాణ టూరిజం రీడిజైన్ చేసిన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, ఆకర్షణలు, అనుభూతులు, పర్యాటకానికి సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదిక ద్వారా సందర్శకులు తెలుసుకునేలా దీన్ని రూపొందించారు.

హోమ్‌స్టే నమోదు ఆన్‌లైన్‌లో..

హోమ్‌స్టే నిర్వాహకులకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ప్రారంభించారు. దీంతో హోమ్‌స్టేల నమోదుకు మరింత సులభమైన, అందుబాటులో ఉండే ప్రక్రియను కల్పించినట్లయింది.

పర్యాటక ప్రచార ట్రైలర్

తెలంగాణలోని వారసత్వం, సంస్కృతి, ప్రకృతి, వంటకాలు, ప్రత్యేక పర్యాటక అనుభవాలను ప్రతిబింబించే కొత్త తెలంగాణ టూరిజం ప్రమోషనల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు.

360 డిగ్రీలతో గైడ్‌లకు శిక్షణ

పర్యాటక గైడ్‌ల జ్ఞానం, నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించేందుకు 360 డిగ్రీల సాంకేతికతతో గైడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంకేతిక ఆధారిత అభ్యాసంతో గైడ్‌లకు నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి ఇది ఉపయోగపడనుంది.

'మై తెలంగాణ.. మై డెస్టినేషన్'

తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించి, తమ అనుభవాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకునేలా 'మై తెలంగాణ.. మై డెస్టినేషన్' డిజిటల్ మీడియా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వీడియోలు, పోస్టర్ క్రియేటివ్‌లను విడుదల చేశారు.

తెలంగాణ పర్యాటకంపై కాఫీ టేబుల్ బుక్

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే కాఫీ టేబుల్ బుక్‌ను విడుదల చేశారు. తెలంగాణ వారసత్వం, ప్రకృతి దృశ్యాలు, సంస్కృతి, పర్యాటక అనుభవాలను ఇందులో చిత్రాలు, సమాచారంతో పొందుపరిచారు.

వీఆర్‌తో పర్యాటక అనుభూతి

తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, పర్యాటక ఉత్పత్తులను పరిచయం చేసేందుకు ప్రత్యేక తెలంగాణ టూరిజం పెవిలియన్ ఏర్పాటు చేశారు. ఇందులో వర్చువల్ రియాలిటీ (వీఆర్) అనుభవాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా సందర్శకులు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఇంటరాక్టివ్‌గా అనుభవించే అవకాశం కల్పించారు.

పర్యాటక రంగంపై చర్చలు

'ఏఐ, డిజిటల్ టెక్నాలజీ–పర్యాటక భవిష్యత్', 'పర్యాటకంలో కొత్త ధోరణులు–ఎకో టూరిజం, సినిమా, క్రీడలు, వారసత్వం' అంశాలపై రెండు ప్యానెల్ చర్చలు నిర్వహించారు. పర్యాటక, సాంకేతిక రంగాలకు చెందిన నిపుణులు ఇందులో పాల్గొన్నారు.

జిల్లాల పర్యాటకానికి ప్రత్యేక ప్రదర్శనలు

తెలంగాణలోని పూర్వ జిల్లాల పర్యాటక ప్రాంతాలు, ఆకర్షణలు, అవకాశాలను పరిచయం చేస్తూ ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ శిల్పాలను, రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ కళాకృతులు, చిత్రాలను ప్రదర్శించారు. నిథమ్ ఆధ్వర్యంలో పర్యాటక, ఆతిథ్య రంగ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిచయం చేసే స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

భద్రగిరి మార్ట్‌కు గుర్తింపు

పర్యాటక రంగంలో విశిష్ట సేవలకు ఎక్సలెన్స్ అవార్డులను అందించారు. పర్యాటక ప్రోత్సాహానికి కృషి చేసిన మెదక్, ములుగు జిల్లాల కలెక్టర్లను సత్కరించారు. భద్రాచలంలో గిరిజన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'భద్రగిరి మార్ట్'ను అభివృద్ధి చేసిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కూడా సత్కరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఈ కార్యక్రమాలు తెలంగాణ పర్యాటక రంగంలో డిజిటల్ పరివర్తన, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, సందర్శకుల అనుభవాల మెరుగుదలకు దోహదపడేలా రూపొందించారు.

ఉల్లాస్ పరీక్ష రాస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు మంత్రి సీతక్క అభినందనలు

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నాడు ఉల్లాస్ పరీక్ష రాస్తున్న లక్షలాది మంది స్వయం సహాయక సంఘాల సోదరీమణులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. విద్యకు వయసుతో సంబంధం లేదు.. విద్యే మనిషికి బలమైన ఆయుధం అని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరిస్థితులు, ఉపాధి లేకపోవడం, చిన్న వయసులో వివాహం వంటి కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన మహిళలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. బడి మానేయడం అంటే చదువు ముగిసిపోయినట్లు కాదని, ఆగిపోయిన చదువును ఎప్పుడైనా తిరిగి కొనసాగించవచ్చని అన్నారు.ఉల్లాస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి నేరుగా పదో తరగతి పరీక్ష రాసే అవకాశం లభిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో చదువు మధ్యలో ఆపేసిన మహిళలను గుర్తించి, తిరిగి విద్యను కొనసాగించేలా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా సెర్ప్ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలను కేవలం ఆర్థికంగా మాత్రమే కాకుండా విద్య, సామాజిక సాధికారతలోనూ ముందుకు తీసుకెళ్లడమే ఇందిరా మహిళా శక్తి లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ULC దరఖాస్తులకు మోక్షం

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ULC) దరఖాస్తుల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.గత ప్రభుత్వం 2016లోనే ULC కింద పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జీవో జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు. ఫలితంగా ప్రజలు తమ భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పానికి అనుగుణంగా సహచర క్యాబినెట్ మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

ULC పెండింగ్ దరఖాస్తులపై తాజా నిర్ణయం

తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (ULC) కింద పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన GO నం.455, 456, 747, 92 కింద వచ్చిన పెండింగ్ ULC దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే విధంగా ఆదివారం నాడు Memo.No.48062/ULC/A1/2026-1, జారీ చేసినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి క్రమబద్ధీకరణ చర్యలు తక్షణం చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.

2016లో జీవో.. అమలు మాత్రం శూన్యం

ULC సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 2016లో జీవో జారీ చేసినప్పటికీ, ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు.

22A సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం

ఈ నెల 16న శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సెక్షన్ 22Aతో ముడిపడి ఉన్న 10–12 కీలక అంశాలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.ఇప్పటికే 22A సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం, ఆ తర్వాత జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ, ఆ వెంటనే జి .ఓ 76కు అనుగుణంగా మెమో ఇవ్వడం జరిగిందన్నారు. 22 ఎ లో ఉన్నప్పటికీ GHMC, HMDA, DTCP, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఉత్తరులు జారీ చేయడం జరిగిందన్నారు. తాజాగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ULC దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మిగిలిన అన్ని సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

"దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని, వారికి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రతి భూ సమస్యను పరిశీలించి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యం అన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తాను, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్‌బాబు, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దామోదర రాజనర్సింహ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ, తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో నిర్వహించిన ఓటర్ల సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఓటర్ల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. పట్టభద్రుల సమస్యలు, హక్కుల కోసం శాసన మండలిలో బలమైన గొంతుకగా నిలిచేలా పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మంత్రి కోరారు. గ్రామాలు, పట్టణాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారికి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్ భరత్, నైనా జైస్వాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడాలి

- CEC జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి
- SIR వ్యవహారంపై కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో మాజీ కేరళ ప్రధాన కార్యదర్శి జీజీ థామ్సన్ చేసిన తాజా ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి
- ప్రసన్నకుమార్ శర్మ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

హైదరాబాద్, వెలుతురు 27 సెప్టెంబర్ :

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ. దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిష్పక్ష పాతంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపై ఉంది.ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం. ఎన్నికల సంఘం నిర్ణయాలపై రాజకీయ పక్షపాతం లేదా అనుచిత రాజకీయ సంబంధాలపై అనుమానాలు వ్యక్తమైతే, వాటిని కేవలం రాజకీయ విమర్శలుగా పక్కన పెట్టకుండా, సమగ్రంగా పరిశీలించి ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం నాయకత్వంపై ఉంది.ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు, ముఖ్యంగా Special Intensive Revision (SIR) ప్రక్రియకు సంబంధించిన వివాదాలు, ఓటర్ల జాబితాల పునర్విమర్శ, ఓటర్ల పేర్ల తొలగింపు మరియు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి సమయంలో వెలుగులోకి వచ్చిన మరో తీవ్రమైన అంశం ఎన్నికల సంఘం విశ్వసనీయతపై మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది.

మాజీ కేరళ ప్రధాన కార్యదర్శి జీజీ థామ్సన్ సంచలన ఆరోపణలు

కేరళ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి జీజీ థామ్సన్ ఇటీవల చేసిన బహిరంగ ప్రకటన దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది.జీజీ థామ్సన్ తెలిపిన వివరాల ప్రకారం, 2016లో తాను కేరళ ప్రధాన కార్యద ర్శిగా పనిచేస్తున్న సమయంలో, అప్పటి కేరళ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్‌తో కలిసి విమానంలో ప్రయాణిస్తున్న సందర్భంగా ఒక రాజకీయ ప్రతిపాదన తన ముందుంచారని ఆయన ఆరోపించారు. తన పదవీ విరమణ అనంతరం ఏం చేయాలనుకుంటు న్నారని జ్ఞానేశ్ కుమార్ తనను అడిగారని, తాను పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన కార్యక్రమాల్లో పనిచేయాలని భావిస్తున్నట్లు చెప్పినప్పుడు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని పతనంతిట్ట లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని జ్ఞానేశ్ కుమార్ సూచించారని జీజీ థామ్సన్ వెల్లడించారు. అంతేకా కుండా, తాను ఆ ప్రతిపాదనను వెంటనే తిరస్కరించానని కూడా ఆయన తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ ఆ విమాన ప్రయాణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ మాట్లాడారని, తనను రాజకీయాల్లోకి రావాలని ఒప్పించే ప్రయత్నం చేశారని కూడా జీజీ థామ్సన్ పేర్కొన్నారు. ఈ వివరాలను ఆయన 'Onmanorama'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించినట్లు పలు వార్తా సంస్థలు నివేదించాయి. (NDTV)

ఇది సాధారణ రాజకీయ వ్యాఖ్య కాదు.

ఒక సర్వింగ్ ఐఏఎస్ అధికారి ఒక సీనియర్ సర్వింగ్ ప్రభుత్వ అధికారిని ఒక రాజకీయ పార్టీ తరఫున ఎన్నిక ల్లో పోటీ చేయాలని ప్రోత్సహించారనే ఆరోపణ. అందు వల్ల ఈ ఆరోపణలను తేలికగా తీసుకోవడానికి వీల్లేదు.

2016లో జరిగిన సంఘటనపై స్పష్టత అవసరం

జీజీ థామ్సన్ చేసిన ఆరోపణల ప్రకారం ఈ సంఘటన 2016లో జరిగింది. ఆ సమయంలో జ్ఞానేశ్ కుమార్ ప్రభుత్వ సేవలో ఉన్న ఐఏఎస్ అధికారి.ఒక సర్వింగ్ ప్రభుత్వ అధికారి ఒక రాజకీయ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయమని మరో సీనియర్ ప్రభుత్వ అధికారిని ప్రోత్సహించారనే ఆరోపణ నిజమైతే, అది ప్రభుత్వ సేవలో రాజకీయ తటస్థత, అధికారుల ప్రవర్తనా ప్రమాణాలు, ప్రజాసేవలో నిష్పక్షపాత ధోరణి వంటి అంశాలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది.

ఇది కేవలం గతంలో జరిగిన ఒక వ్యక్తిగత సంభాషణగా కొట్టిపారేయలేని విషయం.

ఎందుకంటే, అదే వ్యక్తి ప్రస్తుతం దేశంలోని అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థల్లో ఒకటైన భారత ఎన్నికల సంఘానికి నాయకత్వం వహిస్తున్నారు.

ఎన్నికల సంఘం నిష్పక్షపాతత్వంపై ప్రజలకు నమ్మకం ఉండాలి

ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో ఉన్న వ్యక్తి విషయంలో ప్రజలకు ఎలాంటి రాజకీయ అనుబంధం లేదా రాజకీయ పక్షపాతం ఉన్నదనే అనుమానం కలగ కూడదు.ఎన్నికల సంఘం ఒక రాజకీయ పార్టీకి అనుకూ లంగా గానీ, మరో రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా గానీ పనిచేస్తుందనే భావన ప్రజల్లో ఏర్పడితే, అది ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేయాలి.

జీజీ థామ్సన్ చేసిన ఆరోపణలు ఆయన స్వయంగా వెల్లడించిన ఆరోపణలు మాత్రమే. వాటిపై తుది నిర్ణయం తీసుకోవడానికి స్వతంత్ర విచారణ అవసరం. అయితే, ఒక మాజీ కేరళ ప్రధాన కార్యదర్శి స్వయంగా చేసిన ఈ ఆరోపణలను పూర్తిగా విస్మరించడం కూడా సముచితం కాదు.

ఆరోపణ నిజమా? కాదా?

2016లో అలాంటి సంభాషణ జరిగిందా?

జ్ఞానేశ్ కుమార్ ఒక సర్వింగ్ ఐఏఎస్ అధికారిగా ఉన్న సమయంలో రాజకీయ పార్టీ తరఫున పోటీ చేయాలని ఒక అధికారిని ప్రోత్సహించారా? అలా చేసి ఉంటే, దానికి సంబంధించిన నియమాలు ,సేవా ప్రమాణాల పరిస్థితి ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియాలి.

జ్ఞానేశ్ కుమార్ స్వయంగా వివరణ ఇవ్వాలి

ఇంత తీవ్రమైన ఆరోపణలు వెలువడిన తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేశ్ కుమార్ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. జీజీ థామ్సన్ చేసిన ఆరోప ణలను ఆయన అంగీకరిస్తున్నారా?

- లేక పూర్తిగా ఖండిస్తున్నారా?
- 2016లో విమాన ప్రయాణంలో అలాంటి సంభాషణ జరిగిందా?
- జీజీ థామ్సన్‌ను బీజేపీ తరఫున పతనంతిట్ట నుంచి పోటీ చేయమని తాను సూచించారా?
- మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ రాజకీయ చర్చ జరిపారా?
- ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- ఎందుకంటే ప్రస్తుతం ఆయన వ్యక్తిగత హోదాలో ఉన్న వ్యక్తి కాదు.
- ఆయన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్.
- SIRపై కొనసాగుతున్న ప్రశ్నల నేపథ్యంలో ఈ ఆరోపణలకు మరింత ప్రాధాన్యత

ఇటీవలి కాలంలో ఎన్నికల సంఘం చేపట్టిన Special Intensive Revision – SIR ప్రక్రియపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ జరుగుతోంది.ఓటర్ల జాబి తాలను శుద్ధి చేయడం, డూప్లికేట్ పేర్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, అర్హత లేని నమోదులను తొలగించడం వంటి చర్యలు ఎన్నికల సంఘం బాధ్యతలో భాగమే. అయితే అదే సమయంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన సూత్రం.SIR అమలుపై కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎన్నికల సంఘం నాయకత్వం పట్ల రాజకీయ పక్షపాతం ఉందనే అనుమానాలు వ్యక్తమైతే, ఎన్నికల సంఘం స్వయంగా మరింత పారదర్శకతతో వ్యవహరించాల్సి ఉంటుంది.

ఎన్నికల సంఘంపై వచ్చిన ప్రతి ప్రశ్నకు పారదర్శక సమాధానం అవసరం

ఇటీవల ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలపై పలు సందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఆ నివేదికలో SIR ప్రక్రియ, ఓటర్ల పేర్ల చేర్పులు , తొలగింపులు, ఓటర్ల డేటాబేస్‌కు సంబంధించిన అంశాలు తదితర విషయాలపై అభ్యంతరాలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఎన్నికల సంఘం ఈ విషయాలపై వివరణ ఇస్తూ, SIRకు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసు కున్నామని తెలిపింది. (NDTV)

ఈ నేపథ్యంలో కూడా మా డిమాండ్ స్పష్టంగా ఉంది:

ఎన్నికల సంఘం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకు అర్థమయ్యే విధంగా పారదర్శకంగా ఉండాలి. రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాంగ్రెస్ పార్టీ అత్యంత గౌరవిస్తుంది. అందుకే ఎన్నికల సంఘం పట్ల ప్రజల్లో ఎలాంటి అనుమానం ఏర్పడినా దానిని నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంది.ఎన్నికల సంఘం ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉందనే భావన కూడా ఏర్పడకూడదు.

ప్రజలకు ఈ నమ్మకం ఉండాలి:

- "నా ఓటు సురక్షితంగా ఉంది."
- "నా పేరు ఓటర్ల జాబితాలో న్యాయంగా ఉంటుంది."
- "ఎన్నికల సంఘం అందరినీ సమానంగా చూస్తుంది."
- "ఎవరు అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేస్తుంది."
- ఇదే ప్రజాస్వామ్యానికి అవసరం.

CEC జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఈ నేపథ్యంలో, SIRపై దేశవ్యాప్తంగా కొనసా గుతున్న వివాదాలు, ఎన్నికల సంఘం నిర్ణయాలపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై వెలువడుతున్న వార్తలు ఇప్పుడు మాజీ కేరళ ప్రధాన కార్యదర్శి జీజీ థామ్సన్ చేసిన తీవ్రమైన ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని, ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరఫున డిమాండ్ చేస్తున్నాము. అయితే రాజీనామా డిమాండ్‌తో విషయం ముగిసిపోకూడదు.

జీజీ థామ్సన్ చేసిన ఆరోపణలపై స్వతంత్రంగా, నిష్ప క్షపాతంగా, సమగ్రంగా విచారణ జరపాలి. ఆ విచారణ లో 2016లో జరిగినట్లు ఆరోపించబడుతున్న సంభాష ణ, ఆ సమయంలో జ్ఞానేశ్ కుమార్ నిర్వహించిన ప్రభు త్వ బాధ్యతలు, ప్రభుత్వ సేవా నియమావళి, రాజకీయ పార్టీలతో ఆయనకు ఉన్నట్లు ఆరోపించబడుతున్న సంబంధాల స్వభావం అంశాలను పరిశీలించాలి.

ప్రజల ఓటు — ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు

- భారతదేశంలో ఎన్నికలు ఏ ఒక్క పార్టీకి చెందినవి కావు.
- ఓటర్ల జాబితా ఏ ఒక్క ప్రభుత్వానికి చెందినది కాదు.
- ఎన్నికల సంఘం కూడా ఏ రాజకీయ పార్టీకి చెందినది కాదు.
- ఎన్నికలు ప్రజలవి. ఓటు ప్రజలది. ప్రజాస్వామ్యం ప్రజలది.
- అందువల్ల భారతదేశంలో ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు రక్షించబడాలి.
- ఎన్నికల సంఘం నాయకత్వంపై అనుమానాలు వచ్చినప్పుడు వాటిని నివృత్తి చేయడం అత్యంత అవసరం.
- ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా కనిపించడం మాత్రమే కాదు, నిష్పక్షపాతంగా పనిచేస్తున్నదనే విశ్వాసాన్ని ప్రజలకు కలిగించాలి.
- తెలంగాణ కాంగ్రెస్ పార్టీ డిమాండ్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరఫున మా డిమాండ్లు:

1. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.
2. మాజీ కేరళ ప్రధాన కార్యదర్శి జీజీ థామ్సన్ చేసిన ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరపాలి.
3. 2016లో జ్ఞానేశ్ కుమార్ ఒక సర్వింగ్ ఐఏఎస్ అధికారిగా ఉన్న సమయంలో రాజకీయ పార్టీ తరఫున పోటీ చేయాలని సూచించారనే ఆరోపణలపై వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి.
4. SIR ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా పూర్తి పారదర్శకత పాటించాలి.
5. ఓటర్ల పేర్ల తొలగింపు, చేర్పులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాజకీయ పార్టీలు, ప్రజలకు అందుబాటులో ఉంచాలి.
6. ఎన్నికల సంఘం నిర్ణయాలపై వస్తున్న ప్రతి అనుమానానికి స్పష్టమైన అధికారిక వివరణ ఇవ్వాలి.
7. భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు అవసరమైన రాజ్యాంగపరమైన, సంస్థాగత చర్యలు తీసుకోవాలి.

భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ఎన్ని కల సంఘం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలి.

- ఒక వ్యక్తి కంటే రాజ్యాంగ సంస్థ గొప్పది.
- ఒక పదవి కంటే ప్రజాస్వామ్యం గొప్పది.
- ఒక రాజకీయ పార్టీ కంటే భారత పౌరుడి ఓటు హక్కు గొప్పది.

కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో నెలకొన్న అనుమా నాలకు ముగింపు పలికేందుకు, ఎన్నికల సంఘం విశ్వస నీయతను కాపాడేందుకు, CEC శ్రీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరఫున డిమాండ్ చేస్తున్నాము.

బీసీ సమాజానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక రోల్ మోడల్

- ఆయన త్యాగాలు, పోరాటాలు బీసీ సమాజానికి స్ఫూర్తిదాయకం
- 92 ఏళ్ల వయసులోనూ తెలంగాణ కోసం ఢిల్లీలో పోరాడిన మహనీయుడు
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు, పోరాట స్ఫూర్తి బీసీ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకల్లో మంత్రి వివేక్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాగరాజు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ .. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. తన తండ్రి, మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామికి కొండా లక్ష్మణ్ బాపూజీ అత్యంత సన్నిహిత మిత్రుడని, తన తండ్రి కూడా ఆయనను ఎంతో గౌరవంగా అను సరించేవారని చెప్పారు. తెలంగాణ కోసం, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బీసీల హక్కుల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని వివేక్ అన్నారు. ప్రజల సమస్యలపై ధైర్యంగా పోరాడాలని, అణచివేతకు గురవుతున్న వర్గాల కోసం ముందుకు సాగాలని ఆయన ఎప్పుడూ చెప్పేవా రని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసా గుతున్న సమయంలో 92 ఏళ్ల వయసులోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఢిల్లీకి వచ్చి ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నార ని మంత్రి తెలిపారు. ఆ వయసులో కూడా తెలంగాణ సాధన కోసం వేదికపై నిలబడి పోరాటం చేయడం, నిరాహార దీక్షలో పాల్గొనడం ఆయనకు తెలంగాణపై ఉన్న నిబద్ధతకు నిదర్శ నమని అన్నారు. అదేవిధంగా, తన భూమికి సంబంధించిన సమస్యపై చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను పంపిన సమయంలోనూ 92 ఏళ్ల వయసులో కొండా లక్ష్మణ్ బాపూజీ స్వయంగా హైకోర్టును ఆశ్రయించి తన హక్కుల కోసం పోరాడారని మంత్రి గుర్తుచేశారు. వయసుతో సంబంధం లేకుండా హక్కుల కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శమని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ బీసీ సమాజానికి ఒక రోల్ మోడల్ అని, బీసీలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులు, అవకాశాల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు

సాగాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం బీసీ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వంటి నాయకులు కృషి చేస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బీసీలకు మరిన్ని అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సాధికా రత కల్పించాలనే అంశంపై వారు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తిస్తూ ఆయన పేరును ప్రభుత్వం యూనివర్సిటీ, ఆసుపత్రికి పెట్టడం గర్వకార ణమని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ స్మరించుకుం టారని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు, బీసీ సంఘాల నాయకులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఆయ న ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, బీసీల సాధి కారత కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

దేశ ప్రగతికి అంకితమైన మహోన్నత వ్యక్తిత్వం

"పరోపకారార్థమిదం శరీరం"... ఇది మన ప్రాచీన వివేచనాత్మక నానుడి. ఈ ప్రకృతిలో వృక్షం తన పండ్లను తానే ఆరగించదు... ఏ నదీ తన నీటిని తానే తాగదు... అలాగే సాధుజనులు కూడా ఈ ధరణిపై ఆ స్ఫూర్తితోనే జన్మనెత్తుతారు" అని ఇది ప్రబోధిస్తుంది. ఆశ్రితులకు పండ్లతో ఆకలి తీర్చే వృక్షం.. తీరం చేరినవారికి దప్పిక తీర్చే నది.. జన క్షేమమే పరమావధిగా గల సాధు పుంగవులు ఇదే కోవలోకి వస్తారు. వ్యక్తిగత విజయం కన్నా సాటివారి సంక్షేమానికి అంకితమైన జీవితానికి ఎంతో పరమార్థం ఉంటుందని మన రుషులు, మునులు అనాదిగా ప్రబోధిస్తూనే వచ్చారు. ఆ స్ఫూర్తిని తన జీవితంలో నిండుగా ప్రతిబింబించిన వ్యక్తులలో శ్రీ అశోక్ సింఘాల్ కూడా ఒకరు.

ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యం, దశాబ్దాలపాటు కొనసాగిన అంకితభావం, సంస్థాగత కృషి మూర్తీభవించిన ఆయన అసమాన వ్యక్తిత్వాన్ని స్మరించుకుంటూ, నేటి (సెప్టెంబరు 27) నుంచి ఆయన శతజయంతి వేడుకలను మనం నిర్వహించుకుందాం.

శ్రీ అశోక్‌తో సంభాషించి, ఆయన ఆదరాభిమానాలను పొందే అనేక అవకాశాలు లభించడం నిజంగా నా అదృష్టం. ఓ యువ కార్యకర్తగా సంస్థాగత బాధ్యతల నిర్వహణలో ఉన్నపుడు 1981నాటి ఒక సంఘటన నాకింకా గుర్తుంది. ఆ సమయంలో ఆయన స్వదస్తూరీతో రాసిన లేఖ నాకు అందింది. సహజంగానే నాకు అదొక ప్రత్యేక సందర్భంగా అనిపించింది. త్వరలో చేపట్టబోయే ఓ కీలక కార్యక్రమాన్ని ఆ లేఖలో ప్రస్తావిస్తూ, ఆయన కర్తవ్య నిర్దేశం చేశారు.

ఆయన దశాబ్దాలపాటు రేయింబవళ్లు శ్రమించడం నేను స్వయంగా చూశాను. ఆ రోజుల్లో శ్రీ సింఘాల్ ఎంతో ప్రయాసకోర్చి, సుదీర్ఘంగా పయనిస్తూ మారుమూల ప్రాంతాలకు వెళ్లడం నాకు తెలుసు. ప్రత్యేకించి గుజరాత్‌లోని గిరిజన ప్రాంతాలలో పర్యటనకు ఆయన ఆసక్తి చూపేవారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు ఇంకా ఏమి చేయగలమన్న ఆలోచనే ఆయన మదిలో సదా మెదిలేది. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, బాధితులకు ఆపన్న హస్తం అందించడం కోసం అందరికన్నా ముందు అక్కడికి చేరడం, లేదా అప్పటికే చేరుకున్న కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంలో శ్రీ అశోక్ అగ్రస్థానంలో ఉండేవారు. గుజర్‌లోని కచ్‌లో 2001 నాటి భూకంపం తర్వాత ఆయనతో కలసి పనిచేసిన నా అనుభవం చిరస్మరణీయం.

సాటి మానవులపై కరుణ, వారి సంక్షేమంపై శ్రద్ధ చూపే విశిష్ట లక్షణాలను శ్రీ అశోక్ బాల్యంలోనే అలవరచుకున్నారు. ఆయన తండ్రి శ్రీ మహావీర్ పరిపాలన యంత్రాంగంలో అత్యున్నత హోదాగల అధికారి. అలాంటి ఎంతో గొప్ప, సంపన్న కుటుంబంలో శ్రీ అశోక్ సింఘాల్ జన్మించారు. ఆయన సోదరులలో ఒకరైన శ్రీ బి.పి.సింఘాల్ పోలీసు అధికారిగా ఉద్యగం చేసి, ఆ తర్వాత పార్లమెంటు సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. మరో సోదరుడు శ్రీ వి.పి.సింఘాల్ త్రిపుర రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ కుటుంబంలోని ఇతర సభ్యులు కూడా వాణిజ్య, వ్యవసాయ రంగాల్లో ఎన్నో విజయాలు సాధించారు. అయితే, శ్రీ అశోక్ చిన్న నాటినుంచే భిన్న దృక్కోణం వైపు ఆకర్షితులయ్యారు. అదే... మాతృభూమికి పునరుజ్జీవం, భరతమాత బిడ్డల పూర్వవైభవ పునరుద్ధరణ. చిన్నతనాన ప్రయాగ్‌రాజ్‌లోనదీ సంగమం వద్ద శ్రీ అశోక్ గంటల తరబడి దీర్ఘాలోచనలో మునిగిపోయేవారు. అలా ఆ నదిని చూస్తూ, దానిపైనే కాకుండా, అక్కడ పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే సాధువులు, సన్యాసులు, భక్తులపైనా ఆసక్తి పెంచుకున్నారు. తద్వారా భారతీయ సాంస్కృతిక విలువలపై అవగాహన ఇనుమడించగా, సమాజానికి తనవంతు సేవ చేయాలనే సంకల్పం ఆయనలో బలపడింది. 'పరోపకారార్థమిదం శరీరం' అనే నానుడికి అనుగుణంగా ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వైపు ఆకర్షితులయ్యారు. తదాదిగా తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను ఉత్సాహంతో, క్రమశిక్షణతో, కర్తవ్య భావనతో నిర్వర్తించారు.

పట్టుదల, అవిరళ కృషితో సంస్థలను, ఉద్యమాలను శ్రీ అశోక్ సింఘాల్ నడిపించారు. అద్భుత కంఠస్వరం, యావత్ సభను మంత్రముగ్ధం చేయగల వాగ్ధాటి ఆయన సొంతం. మరోవైపు సాటి కార్యకర్తలతో సౌహార్ద సంబంధాలపై ఆయన శ్రద్ధ కూడా ప్రశంసనీయం. శ్రీ సింఘాల్‌తో పరిచయం తర్వాత ఆయనెంత నిరాడంబరుడో తెలిసి, అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. సాధుసంతులలోనూ ఆయనకు ప్రగాఢ అనుబంధం ఉండేది. కాబట్టే, దేశంలోని సాధువులు, దార్శనికులలో ఆయనపై అపార గౌరవం కనిపించేది. వారంతా ఆయన సలహాలు, సూచనలకు ఎంతో విలువనిస్తే, శ్రద్ధగా ఆలకించేవారు.

ఈ నేపథ్యంలో శ్రీ అశోక్ సింఘాల్ మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటే రెండు సందర్భాలు స్ఫురణకొస్తున్నాయి. మొదటిది- షికాగాలో స్వామి వివేకానంద ప్రసంగ శతాబ్ది వేడుకల్లో భాగంగా 1993లో విశ్వ హిందూ పరిషత్ అమెరికాలో ఒక సదస్సును నిర్వహించింది. అసలు ఇలాంటి కార్యక్రమాన్ని విదేశాల్లో నిర్వహించాలనే విశిష్ట ఆలోచన, తదనుగుణ ప్రణాళిక, విభిన్న భాగస్వాములను ఏకతాటిపైకి తేవడం ఆయనలోని అనుపమాన నిర్వహణ సామర్థ్యానికి మచ్చుతునకలు.

ఇక రెండోది- ట్రినిడాడ్-టొబాగోలోని పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో ప్రపంచ హిందూ సదస్సు-2000 నిర్వహణ. ఆ కార్యక్రమానికి ఆయన రాక ప్రతినిధులందరిలో ఎంతటి ఉత్సాహాన్ని రగిలించిందో నేను ప్రత్యక్షంగా చూశాను. అటుపైన నేను ప్రసంగించాక, నన్ను అభినందిస్తూ ఆయన ప్రసంశపూర్వకంగా పలికిన పలుకులు నన్నెంతో కదిలించాయి. ఆయనిచ్చిన ప్రోత్సాహం వల్ల ప్రతి కార్యకర్త రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం మరోసారి నేను ప్రత్యక్షంగా చూశాను.

రామజన్మభూమి ఉద్యమంలో శ్రీ అశోక్ సింఘాల్ కీలక పాత్ర పోషించడాన్ని గుర్తుచేసుకోకపోతే ఆయన ప్రస్తావనకు అర్థం ఉండదు. ఆయన 1991నాటి బోట్ క్లబ్ సభలో చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరి మదిలో నేటికీ నిలిచి ఉంది. ఈ ఉద్యమం ఉచ్ఛస్థాయికి చేరినపుడు గాయం నుంచి రక్తం స్రవిస్తున్నా ఆయన లెక్కచేయకపోవడాన్ని ఎవరైనా ఎలా మరువగలరు? ఈనాడు అయోధ్యలో దివ్య-భవ్య రామ మందిరం రూపుదిద్దుకుందంటే- నిస్వార్థంగా తమనుతాము ఉద్యమ దీక్షకు అంకితం చేసుకున్న శ్రీ సింఘాల్ వంటి మహనీయులే కారణం. అయోధ్యలో రామ మందిర స్వప్నం సాకారం చూడగలిగి ఉంటే ఆయనెంత సంతోషించి ఉండేవారో ఊహించవచ్చు.

శ్రీ సింఘాల్ ఆలోచనలు అత్యంత స్పష్టంగా ఉండేవి. సమాజం సామరస్యం నెలకొనాలని, సౌభ్రాత్ర భావన సందేశాన్ని పునరుద్ఘాటించాలని ఆయనెంతో గట్టిగా చెప్పేవారు. ఈ స్పష్టమైన వ్యక్తిత్వం ఆయన విశ్వాసంలో వ్యక్తమయ్యేది. సామాజిక ఐక్యత-సమానత్వ బలోపేతానికి ఆయనెంతో కృషి చేశారు. సమాజంలో ఎలాంటి వివక్షకు తావులేదని, ప్రతి ఒక్కరికీ సమాన గౌరవ మర్యాదలు దక్కాలని ఆకాంక్షించేవారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తొలి పునాది రాయిని బీహార్‌లోని అణగారిన వర్గాల క్షేత్రస్థాయి వీహెచ్‌పీ కార్యకర్త శ్రీ కామేశ్వర్ చౌపాల్ చేతుల మీదుగా వేయించాలన్నది ఆయన ఆలోచన. ఇక కాశీలో ఒక 'ధర్మ పరిరక్షణ సభ'లో 'డోమ్ రాజా'ను సత్కరించాలని నిర్ణయించుకున్న ఆయన, ఆ తర్వాత వివిధ సామాజిక కార్యక్రమాలలో ఆయనతో కలిసి పనిచేశారు.

దేశ పురోగమనంతోపాటు మరో రెండు రంగాలపై శ్రీ అశోక్ సింఘాల్ ఎంతో ఆసక్తి చూపేవారు. వాటిలో ఒకటి విద్య (ముఖ్యంగా వేద విద్య).. రెండోది సంగీతం. ఈ ప్రాచీన కాశీ నగరం ఆయన జీవితంలో ఓ ప్రధాన పాత్ర పోషించిన నేపథ్యంలో నేను వారణాసి ఎంపీగా దీనికి ప్రాతినిధ్యం వహించడం నాకెంతో గర్వకారణం. బీహెచ్‌యూలో విద్యాభ్యాసం చేసిన సమయంలో ఉత్తమ విద్యార్థిగానూ శ్రీ సింఘాల్ గుర్తింపు పొందారు. మారుమూల గ్రామాలకు.. ముఖ్యంగా గిరిజన వర్గాలకు ప్రాథమిక విద్యా ప్రదానం దిశగా కృషి చేసిన 'ఏకల్ విద్యాలయ' కార్యక్రమంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఉండేది. ఆయన విపరీతంగా పుస్తకాలు చదవడంతోపాటు ఇతరుల మాటకు ఎంతో ప్రాధాన్యమిస్తూ శ్రద్ధగా వినేవారు. వీలైనంత ఎక్కువగా పుస్తకాలు చదవాల్సిందిగా యువ కార్యకర్తలను ఆయన సదా ప్రోత్సహించేవారు.

శ్రీ అశోక్ సింఘాల్ అద్భుత గాయకుడని ఆయనతో సాన్నిహిత్యం గలవారికి తెలుసు! నాగ్‌పూర్‌లో సమావేశాల సందర్భంగా ఆయన 'ఏకల్ గీత్' ఆలాపనతో అందరినీ అప్రతిభులను చేయడం నేను ప్రత్యక్షంగా చూశాను. తద్వారా ఆయన సమావేశాలకు ఒక సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించేవారు. ముఖ్యంగా తన 90వ జన్మదినం సందర్భంగా 2015లో ఆయన అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ- "హే మాతృభూమి మేరీ... హే పితృభూమి మేరీ" అని పాడిన వీడియో ఎంతగా ప్రజల్లోకి దూసుకెళ్లిందో నాకిప్పటికీ గుర్తుంది.

ఈ నేపథ్యంలో ఇవాళ ఆయన శతజయంతి సందర్భంగా- యువతరం మరింతగా ఆయన మహోన్నత వ్యక్తిత్తం గురించి తెలుసుకునేలా మనం కృషి చేద్దాం. అలాగే, మన మాతృభూమి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఆయన కన్న కలల సాకారం దిశగా మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిద్దాం.

దాద్ పల్లి గ్రామంలో ఎంబిబిఎస్ ప్రభుత్వ కళాశాలలో సీటు తగ్గించుకున్న కండె శ్రావ్యను శాలువాతో సన్మానించి అభినందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- కండె శ్రావ్య పై చదువులు చదవడానికి ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్

మంచాల వెలుతురు సెప్టెంబర్ 27:

మంచాల మండలం దాద్ పల్లి గ్రామానికి చెందిన కండె మల్లేష్ గుప్తా కూతురు కండె శ్రావ్య పై చదువులు చదువుకొని భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకు న్న కండె శ్రావ్యను హనుమాన్ దేవాలయం వద్ద స్వీట్ తినిపించి శాలువాతో ఘనంగా సన్మానిం చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లానాయకుడు పాలకుర్ల శేఖర్ గౌడ్ సీనియర్ నాయకులు మా మిడిపల్లి శ్రీనివాస్ నేనావత్ రాజు నాయక్ ఈ సందర్భంగా పాలకుర్ల శేఖర్ గౌడ్ మాట్లాడుతూ దాద్ పల్లి గ్రామం నుండి ఎంబిబిఎస్ విద్యకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణం అని అ న్నారు కండె శ్రావ్య ఎంబిబిఎస్ కావడానికి ప్రోత్సహించిన వారి తల్లిదం డ్రులకు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు ఈకార్యక్రమంలో శ్రావ్య కుటుం బసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆంబోతు తండా సర్పంచ్ రాణి శ్రీనివాస్, వార్డు సభ్యులు

- గ్రామాల అభివృద్ధి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చటమే లక్ష్యం రాజకీయాల కతీతంగా ప్రజాస మస్యల పరిష్కారమే లక్ష్యం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 27:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తొర్రూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంచాల మండలం ఆంబోతుతండా సర్పంచ్ రాణి శ్రీనివాస్ వార్డుసభ్యులు ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ ఎన్నికలవేళ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చటంతో పాటు గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని తెలిపారు మంచాలమండ లం అంబోతుతండా గ్రామసర్పంచ్ రాణీ శ్రీనివాస్ మాజీ సర్పంచ్ రఘు వార్డు సభ్యులు హరి మౌనికాచందర్ తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన నాయకుల.కార్య కర్తలు ఆదివారం మల్‌రెడ్డి స మక్షంలో కాంగ్రె స్‌లో చేరారు తొర్రూర్‌లోని క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కం దువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు ప్రజలకు మరింత చేరువగా ఉంటూగ్రామాల అభివృద్ధికి క లిసి పనిచేయాలని చెప్పిన ఆయన ఈచేరికలతో గ్రామంలో పార్టీ మరింత బలోపేతంఅవుతుం దన్నారు రోడ్లు డ్రైనేజీ తాగునీరు మౌలిక వసతులతో పాటుసంక్షేమ పథకాలు ప్రతి

అర్హుడికి అందేలా కలిసి పనిచేయాలన్నారు రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతఇస్తూ గ్రామాల అభివృద్ధి లో భాగస్వాములు కావాలన్నారు పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్క రికీ సముచితగౌరవం బాధ్యతలు కల్పిస్తామని మల్‌రెడ్డి హామీ ఇచ్చారు కార్యక్రమంలో మంచా ల మండలానికి చెందిన వివిధ గ్రామాల సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో ఘనంగా
చండీశ్వర్ యూత్ వినాయక నిమజ్జనం

- లక్షా పదకొండు వేల రూపాయలు 1,11,000/- పలికిన లడ్డువేలం

మంచాల వెలుతురు సెప్టెంబర్ 27:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని చండీశ్వర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠిం చిన వినాయక నిమజ్జనం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు రకరకాల వేషధారణలతో డోలు విన్యాసాలతో డప్పుల దరువులతో కన్నుల పండుగగా నిమజ్జన కార్యక్రమం జరిగింది అంతకుముందు వినాయకుడి లడ్డు వేలం పాటలో అత్యధిక ధరకు ఒక లక్షా పదకొండు వేల రూపాయలకు1,11,000గ్రా మానికి చెందిన చెరుకు పర్వతాలు కైవసం చేసుకున్నారు చిన్నల డ్డును చెరుకు వెంకటేష్ ముప్పైఏడు వేల రూపాయలకు37,000కైవసం చేసుకున్నారు ఈ ని మజ్జన కార్యక్రమంలో కురుమ యాదవ సంఘం కులపెద్దలు యూత్ సభ్యులు గ్రామస్తులు మ హిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరాలకు ఆదర్శం.. మాధవరం రంగారావు

కూకట్ పల్లి సెప్టెంబర్ 27 వెలుతురు:

తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మబండలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావుతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొని బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. నిజాం పాలన కాలంలో వెట్టి చాకిరీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఆయన ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసిన బాపూజీ, న్యాయవాదిగా కూడా బాధితుల పక్షాన నిలిచి ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన నాయకుడిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోయారని రంగారావు అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం చేనేత రంగానికి సంబంధించిన సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిందని, చేనేత కార్మికులు, డిజైనర్లకు ఆయన పేరుతో రాష్ట్రస్థాయి పురస్కారాలను అందజేస్తోందని తెలిపారు. పదవుల కంటే ప్రజలే ముఖ్యం.. వ్యక్తిగత ప్రయోజనాల కంటే తెలంగాణ ప్రయోజనాలే మిన్న" అనే స్ఫూర్తిని తన

జీవితంతో చాటిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ పద్మశాలి సంఘం అధ్యక్షులు బిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, శ్రీనివాస్‌తో పాటు సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమానికి బలమైన పునాది వేసిన ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 27:

ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకొని కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్ లో కొంపల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమం వేడుకకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేశ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి బలమైన పునాది వేసిన ఉద్యమ వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఏ ఒక్క వర్గానికి చెందిన నేత కాదని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోరిన మహానేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కొంపల్లి

పద్మశాలి సంఘం చైర్మన్ మామిడాల ఉమాశంకర్, ప్రెసిడెంట్ గోలి ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ కె.మల్లికార్జున రావు, ఎస్. వెంకటేష్ నేత, కార్యదర్శి కె. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు భోగా నరేందర్,వి. రాజేందర్, కోశాధికారి కొండా కరుణాకర్, మాజీ కౌన్సిలర్లు డప్పు కిరణ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 27:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదివారం 283 డివిస్ గిరి నగర్ పరిధిలోని ఇందిరాగాంధీ నగర్, సౌభాగ్య నగర్, ఆదర్శ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.ఇందిరాగాంధీ నగర్‌లో రూ.40 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన సీసీ రోడ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిని పర్యవేక్షించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.అనంతరం సౌభాగ్య నగర్‌లో కల్వర్టు పనులను పరిశీలించారు. అలాగే ఆదర్శ్ నగర్‌లో పాత సీసీ రోడ్లు, మరమ్మతులు అవసరమైన రోడ్లు మరియు కొత్త సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు బియ్యాని శివ కుమార్, డివిజన్ అధ్యక్షులు కనకరావు, జలీల్ ఖాన్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జైరామ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మిరెడ్డి, తైలం శ్రీనివాస్, అజర్ (మైనారిటీ ప్రెసిడెంట్), శ్యామ్ (ఎస్సీ సెల్ ప్రెసిడెంట్), ప్రకాష్, చారి, మల్లారెడ్డి, మాధవి రాణి, చంద్రయ్య, చిన్నమ్మ, లక్ష్మిరెడ్డి, కె. లక్ష్మి, వరలక్ష్మి, నీలా గుప్తా, తదితరులు పాల్గొన్నారు.అలాగే

ఆదర్శ్ నగర్‌కు చెందిన సాంబశివరావు, సురేందర్, నాయుడు, వరలక్ష్మి , జయప్రదా రెడ్డి, రాజకుమారి; సుమిత్ర నగర్‌కు చెందిన చంద్రయ్య, శ్రీనివాస్, బ్రహ్మానందం, వెంకటేష్, సౌభాగ్య నగర్‌కు చెందిన రవీందర్ గుప్తా, సురేందర్ రెడ్డి, అఫ్సర్ ఖాన్, అమ్జద్, సమీ, షేర్ ఖాన్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

మోత్కూరుకు కోర్టు మంజూరు లో విఫలం అయిన ఎమ్మెల్యే

- బిఆర్ఎస్ నాయకులు దాసరి తిరుమలేష్.

మోత్కూర్, సెప్టెంబర్ 27, వెలుతురు న్యూస్ :

మోత్కూర్‌కు నూతన కోర్టు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే మందుల సామేల్ విఫలమయ్యారని, ఇందుకు మోత్కూర్ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటికే ఉన్న కోర్టులకు అదనంగా ఏడు కొత్త కోర్టులు మంజూరైనా మోత్కూర్‌కు ఒక్క కోర్టు కూడా మంజూరు కాకపోవడం బాధాకరమన్నారు.యాదాద్రి భువనగిరికి మూడు, రామన్నపేటకు ఒకటి, చౌటుప్పల్‌కు రెండు, ఆలేరుకు ఒక అదనపు కోర్టు మంజూరయ్యాయని తెలిపారు. మోత్కూర్, అడ్డగూడూరు, ఆత్మకూరు, గుండాల మండలాల పరిధిలో 1,700కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యంగా మోత్కూర్, అడ్డగూడూరు మండలాల కేసులను పరిగణనలోకి తీసుకున్నా నూతన కోర్టు ఏర్పాటుకు అర్హత ఉందన్నారు. మోత్కూర్, అడ్డగూడూరు ప్రాంతాల ప్రజలు కేసుల నిమిత్తం రామన్నపేట కోర్టుకు 50 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని, సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యపై ఎమ్మెల్యే తన హోదా, పలుకుబడిని వినియోగించి కోర్టు మంజూరుకు కృషి చేయాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు కనిపించలేదని

విమర్శించారు. కోర్టు ఏర్పాటు కోసం అవసరమైతే ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో దాసరి కనుకయ్య, కొంపెల్లి నర్సింహా, దాసరి నరేష్, పందుల సురేష్, దాసరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 27:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్ లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ.2,14, 000 విలువల గల ఆరు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ గారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసాగా నిలుస్తుందని అన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ

కౌన్సిలర్లు అర్కల అనంతస్వామి ముదిరాజ్, కోల సాయి యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీశైలం యాదవ్, డీజే రమేష్, జయం చారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు 'కరాటే' ఓ అస్త్రం

- విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందాలి
- సినీ నటుడు సుమన్

శంకర్‌పల్లి, వెలుతురు సెప్టెంబర్ 27 :

ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరమైన సాధనమని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా విద్యార్థులు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలో శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు.శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో సక్సెస్ షోటోకాన్ కరాటే–దూ ఆధ్వర్యంలో 14వ స్టేట్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్‌ను ఘనంగా నిర్వహించారు. కరాటే మాస్టర్ అనిల్‌కుమార్ సారథ్యంలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి కరాటే క్రీడాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. కరాటే కేవలం క్రీడ మాత్రమే కాదని, అది ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఏకాగ్రతతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించే విద్య అని పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే పిల్లలకు కరాటేలో శిక్షణ అందిస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు .కరాటే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు వివిధ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల సందర్భంగా కరాటే విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, పోరాట నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు నిర్వాహకుల ఆధ్వర్యంలో మెడల్స్, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.కరాటే మాస్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కరాటే ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమ న్నారు.కార్యక్రమంలో కరాటే కోచ్‌లు, క్రీడాకా రులు, తల్లిదండ్రులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మాజీ శాసన సభ్యులు ఈకూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి)సెప్టెంబర్ 27:

ఈ నెల 30వ తేదీన సిరిసిల్లలో జరగనున్న ముఖ్యమంత్రి సభకు సంబంధించిన ఏర్పాట్లను కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్, కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ , ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఇతర మౌలిక వసతులపై సంబంధిత నాయకులు, నిర్వాహకులతో ఆయన చర్చించారు.సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు తాగునీరు, కూర్చునే సౌకర్యం, వాహనాల

పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సభను విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణంలో సభకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బల్మూర్ వెంకట్,MLC శంకర్ నాయక్,సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ K.K మహేందర్ రెడ్డి,DCC అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలలో జన్మించి నాటి అన్యాయాన్ని ధిక్కరించిన వీర వనిత ఐలమ్మ

- చాకలి ఐలమ్మ పోరాటం నేటి మహిళా లోకానికి స్ఫూర్తి కావాలి
- ఐలమ్మ స్ఫూర్తితో మహిళలందరూ కలిసి బెల్ట్ షాపులు లేకుండా చేయాలి
- చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

వెలుతురు సంస్థాన్ నారాయణ పూర్ సెప్టెంబర్ 27:

యాదాద్రి భువనగిరి జిల్లా,సంస్థాన్ నారాయణ పూర్ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర రజక సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గారి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గారితో కలిసి పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ గారి విగ్రహాన్ని ఆవిష్కరించిన మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు..

కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ

- బడుగు బలహీన వర్గాలలో జన్మించి నాటి అన్యాయాన్ని ధిక్కరించిన వీర వనిత ఐలమ్మ
- చాకలి ఐలమ్మ పోరాటం నేటి మహిళా లోకానికి స్ఫూర్తి కావాలి
- ఐలమ్మ స్ఫూర్తితో మహిళలందరూ కలిసి బెల్ట్ షాపులు లేకుండా చేయాలి
- మునుగోడు ప్రాంతం గత కొన్ని ఏళ్లనుండి నుండి సాగునీరు లేక ఎడారిలా మారింది.
- గత ప్రభుత్వం శివన్న గూడెం రిజర్వాయర్ ఏర్పాటు చేస్తానని శంకుస్థాపన చేసి మధ్యలోనే వదిలేసింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి సీఎం రేవంత్ రెడ్డి తో ఎన్నోసార్లు డిండి ప్రాజెక్టు నుండి వచ్చేలా ఏర్పాటు చేయాలని చెప్పాను
- అదే విషయమై నకిరేకల్ సభలో సీఎంతో మాట్లాడి

ఒప్పుకున్నాకే శాలువా కప్పాను

- దానికి కూడా రేవంత్ రెడ్డిని మొన్నటి వరకు తిట్టి మంత్రి పదవి కోసమే కలిసానని బద్నాం చేస్తుండ్రు.
- తనకు మంత్రి పదవి ఇవ్వడం అనేది సీఎం రేవంత్ రెడ్డి చేతిలో లేదని, అధిష్టానం చేతిలోనే ఉంది.
- ఎల్బీనగర్ నుండి పోటీ చేస్తే రేవంత్ రెడ్డి తో పాటు అధిష్టానం మంత్రి పదవి ఇస్తానని చెప్పిన, మునుగోడు ప్రాంతం కోసమే ఇక్కడి నుండి పోటీ చేశా.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంతో స్థానిక ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మాట్లాడతాం మిగిలిన రెండు సంవత్సరాల కాలంలో నియోజకవర్గ సమస్యలని తీర్చి అభివృద్ధి చేసుకోవాలి...

జహీరాబాద్ నుంచే టీడబ్ల్యూయూ
ఆర్టీసీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

- ప్రచార రథాన్ని ప్రారంభించిన కార్మిక సంఘం నేతలు...
- కార్మిక సంక్షేమం, ఆర్టీసీ విలీనమే ప్రధాన అజెండా...
- బాణం గుర్తుకు ఓటు వేయాలని కార్మికులకు పిలుపు...

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల ప్రచారానికి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వేదికగా మారింది. టీడబ్ల్యూయూ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తూ ప్రచార రథాన్ని వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ అశ్వత్థామ రెడ్డి, ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల నూతన అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలో భారీగా ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ నుంచే ఆర్టీసీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా ఇక్కడి నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టామని నాయకులు తెలిపారు. ప్రచారంలో భాగంగా కార్మికులను కలిసి కూటమి విధానాలు, ప్రధాన డిమాండ్లను వివరించారు. టీడబ్ల్యూయూ, ఎస్ఈడబ్ల్యూఎఫ్ కూటమి బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులకు నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పించడం తమ

ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ అశ్వత్థామ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై కులమతాలకు అతీతంగా పోరాడుతామని అన్నారు. టీడబ్ల్యూయూ, ఎస్ఈడబ్ల్యూఎఫ్ కలయిక కార్మికుల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. అక్టోబర్ 9న జరగనున్న ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి కార్మికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, డిపోలకు చెందిన కార్మిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యకర సమాజం

మునుగోడు, సెప్టెంబర్ 27 (వెలుతురు):

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం,25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం రైతుల సమస్యలపై మాట్లాడుతూ తక్కువ వర్షపాతం కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతుల ను తెలంగాణ ప్రభుత్వం ఆ డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి, అవసరమైతే అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు.ఈ కార్య క్రమంలో కిసాన్

మోర్చా రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శియానాల కరుణాకర్ రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా నాయకులు గున్న నవీన్,జిల్లా కార్యవర్గ సభ్యులు కంభంపాటి నరసింహ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి లింగయ్య,లేబర్ సెల్ జిల్లా కో కన్వీనర్ మాధగోని నరేందర్ గౌడ్,ఎస్సీ మోర్చా జిల్లా కార్య వర్గ సభ్యులు నీరుడు రాజారాం,జెల్ల రవితేజ,సీనియర్ నాయకులు బొలుగురి రమేష్, మండల ప్రధాన కార్య దర్శి అక్కెనపల్లి సతీష్,పందుల యాదయ్య పాల్గొన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక శ్రేణులు స్వాగతం

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి

నూతనకల్ సెప్టెంబర్ 27(వెలుతురు):

నూతనకల్ మండల కేంద్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ మరియు గ్రామ మహిళా సమాఖ్య భవనముల శంకుస్థాపన చేయనున్నారని నూతనకల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనాలని వారు తెలిపారు.

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 27:

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. చౌటుప్పల్ గురుకుల విద్యాల యం పూర్వ ప్రిన్సిపల్ కే. వెంకట నరసయ్య కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షుడిగా డి సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా రమా దేవి, కోశాధికారిగా వీ తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్ రెడ్డి, వెంకటాచారి, కెవిఎన్ ఆచార్య, కే నాగేశ్వరరావు, చంద్రకళ, అంజన్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా కే. రవి చందర్, పి. శ్యాంసుందర్ ఎన్నికయ్యారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ
సాధన కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మోత్కూరు, సెప్టెంబర్ 27, వెలుతురు :

బలహీన వర్గాల ఆశాజ్యోతి,స్వాతంత్ర సమర యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి (బి.ఆర్. ఎస్ ఎస్)రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.ఆదివారం లక్ష్మణ్ బాపూజీ 111వ, జయంతి సందర్భంగా మోత్కూరులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొని పేదల పక్షాన నిరంతరం కృషి చేశారన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు క్రియాశీలక పాత్ర పోషించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, స్థానిక నాయకులు బత్తుల యాదగిరి, అశోక్ రవి,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో ఘనంగా అమ్మ యాది పెండెం ఫౌండేషన్ అవార్డుల ప్రదానం

- వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఘన సన్మానం
- విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు
- ముఖ్య అతిథిగా పద్మశ్రీ డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ

గుండాల, సెప్టెంబర్ 27 (వెలుతురు):

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో అమ్మ యాది పెండెం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖు లను గుర్తించి అవార్డులతో సత్కరించడంతో పాటు, విద్యా ర్థులను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెండెం సోమక్క, సత్తయ్య దంపతుల పేరిట ఏర్పాటు చేసిన అమ్మ యాది పెండెం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండెం సత్యనారాయణ, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ సినీ గేయ రచయిత, పద్మ శ్రీ డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కవి మిట్టపల్లి సురేందర్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండెం సత్యనారాయణ మాట్లాడుతూ.. తన తల్లి పెండెం సోమక్క పేరిట గత 14 సంవత్సరాలుగా ఫౌండేషన్‌ను కొనసాగిస్తున్నామని తెలిపారు. తల్లిపై ఉన్న అపారమైన ప్రేమ, అభిమానంతోనే ఆమె పేరును చిరస్థాయి గా నిలబెట్టేలా సేవా కార్యక్రమాలను

చేపడుతున్నామని భావోద్వేగంతో పేర్కొన్నారు. సమాజానికి తమ వంతు సేవ చేయాలనే సంకల్పంతో విద్యార్థులను ప్రోత్స హించడం, ప్రతిభావంతులను గుర్తించడం, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని సత్కరించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రతిభకు గుర్తింపు.. సేవలకు గౌరవం

కార్యక్రమంలో భాగంగా సినీ రంగం, వైద్య రంగం, విద్యా రంగం, మీడియా, సాహిత్యం, కళలు తదితర రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను గుర్తించి అమ్మ యాది పెండెం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అవార్డులు అందజేసి సత్కరించారు. సేవా కార్యక్రమాలకు ముందుండే వ్యక్తులను గుర్తించి గౌరవించడం ద్వారా మరింత మందికి స్ఫూర్తి కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సమాజంలో తమ రంగాల ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవార్డులు అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అవార్డులు అందుకున్న ప్రముఖులను అతిథులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ

స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఫౌండేషన్ తరఫున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అతిథులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో నిలబెట్టడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు, ప్రతిభావంతులు, వివిధ రంగాల్లో సేవలందించే వారికి అండగా నిలుస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్, రెడ్ క్రాస్ చైర్మన్ డా. లక్ష్మీ నరసింహారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సద్ది వెంకటరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.ఎన్. చారి, ఉప సర్పంచ్ పెద్దిరాజు, ఫౌండేషన్ సభ్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం ఘనంగా జరగడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

దళిత యువకులను కొట్టడం అన్యాయం

- తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

యాదగిరిగుట్ట సెప్టెంబర్ 27 (వెలుతురు):

యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో వినాయకుడి నిమజ్జనోత్సవం సందర్భంగా కెసిఆర్ పాటలు పెట్టారనే కారణంతో దళిత యువకులను కొట్టడం సరి అయింది కాదని వారిని కొట్టిన యాదగిరిగుట్ట టౌన్ సిఐని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు . ఆదివారం ఆయన నాయకులు , కార్యకర్తలతో కలిసి సైదాపురం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని జరిగిన విషయం అడిగి తెలుసుకున్నారు. అక్కడినుండే ఆయన డిఎస్పి శ్రీనివాస్ నాయుడుతో ఫోన్లో మాట్లాడారు. డిఎస్పి కి విషయాన్ని వివరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా దళిత యువకులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద కేసీఆర్ పాటలు అభిమానంతో పెట్టుకున్నారని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వద్దని చెప్పాలి కానీ పోలీస్ స్టేషన్కు పిలిపించి సిఐ ఇష్టం వచ్చినట్లుగా బెల్టుతో కొట్టారని ఆరోపించారు. దళిత యువకులను అకారణంగా కొట్టిన సిఐని సస్పెండ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు

చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే ఎస్పీని, డీజీపీ కలిసి ఫిర్యాదు చేస్తామని అవసరమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు . ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రోత్సాహంతోనే సీఐ దళిత యువకులను అకారణంగా కొట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి కేసీఆర్ పాటలు పెడితే కొడతారా ? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాసాయిపేట లోని దళితుల అసైన్డ భూమిని స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కంపెనీకి కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సిద్ధమా ? అని ప్రశ్నించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు కందుల రామన్, యాదగిరిగుట్ట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బూడిద సురేందర్ , రాజపేట మండల అధ్యక్షుడు విష్ణు, నాయకులు పులెపాక బిక్షపతి, పులెపాక శ్రీను, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు కొల్లూరి వెంకటేష్, కిష్టస్వామి, ఆంజనేయులు, ఆలేరు మండల అధ్యక్షుడు జంగ రాములు, బాధితులు బాబు, మహేష్, బాలమల్లేష్, కరుణాకర్, ప్రవీణ్, పవన్, డి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాల నివాళులు అర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 27: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ లో తెలంగాణ తొలితరం ఉద్యమం నేత ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాపూజీ దేశం, తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.... కొండ లక్ష్మణ్ బాపూజీ చూపిన ఆశయాలు... త్యాగనిరతి నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకం అన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో బాపూజీ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమంలో తన మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసిన నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడిశెట్టి వసంత లక్ష్మీ భూమయ్య, కార్పొరేటర్లు వాసాల రమేష్, మాసం గణేష్, చొప్పరి జయశ్రీ వేణు, వేముల కవిత చంద్రశేఖర్, పద్మశాలి సంఘం నాయకులు మెతుకు సత్యం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం

- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, రైల్వే రాయితీ, ఇళ్ల స్థలాలు కల్పించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ కమిటీ అధ్యక్షుడు పి. రాంచందర్

వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర యాక్టింగ్ కమిటీ అధ్యక్షుడు పి. రాంచందర్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మునిగాల మాణిక్ ప్రభు అధ్యక్షతన నారాయణఖేడ్ డివిజన్ 3వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి. రాంచందర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల వృత్తి అనేక సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే క్రమంలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు, ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న విధంగా అర్హులైన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు, హెల్త్ కార్డు, రైల్వే రాయితీ, ఇళ్ల స్థలాలు కల్పించడంతో పాటు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన నిరంతర పోరాటాల ఫలితంగా నారాయణఖేడ్ డివిజన్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లభించాయని తెలిపారు. మిగిలిన అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు కల్పించే వరకు సంఘం తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని, జర్నలిస్టుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు.జర్నలిస్టుల వినతిపై ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సానుకూలంగా స్పందించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చడంతో పాటు మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల పక్షాన, జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల కృష్ణయ్య, పాండు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. రఘు, బి. రాజశేఖర్, సంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడు రాజు గౌడ్, నారాయణఖేడ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళా సంఘం
అధ్యక్షురాలిగా త్యార్ల నవనీత ఏకగ్రీవ ఎన్నిక

- కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గం ఎంపిక...
- నూతన అధ్యక్షురాలికి ఘన సన్మానం...
- మహిళల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్ష....

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా త్యార్ల నవనీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన కార్యవర్గం నియామకంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘం అధ్యక్షురాలిగా త్యార్ల నవనీత పేరును ప్రతిపాదించగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ఆమెను నూతన అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షురాలు త్యార్ల నవనీతను ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళా సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. త్యార్ల నవనీత ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నామ రవికిరణ్, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాగళ్ల వేణుగోపాల్, మహిళా సంఘం మాజీ అధ్యక్షురాలు సుధా, మారం కల్పన, కార్యదర్శి పద్మ, సహదర్యులు కోటికె పూర్ణచందర్, పార్ని సంతోష్, కార్యవర్గ సభ్యులు సూరంపల్లి అంజయ్య, త్యార్ల గౌతమ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- కుల వివాదం కాస్త కాంగ్రెస్ వర్సెస్ బిజెపి గా మారిన వైనం..
- ఇరు వర్గాల పై కేసులు నమోదు చేసిన పోలీసులు
- చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన జిల్లా రజక సంఘం నేతలు.

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 27: కరీంనగర్ పట్టణం లోని చిట్టెల ఐలమ్మ చౌరస్తా వద్ద జరిగిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఈ వేడుకలు కాస్తా కుల గొడవగా మారి, చివరికి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ రాజకీయ రంగు పులుముకుంది. ఘటనకు సంబంధించి బాధితులు, రజక సంఘం నాయకులు కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా శనివారం జరిగిన చిట్టెల ఐలమ్మ జయంతి వేడుకలకు హాజరు కావలసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు సమావేశానికి రా కుండా నాలుగు గంటలు ఆలస్యంగా రావడం , అధికారికంగా నిర్వహించాల్సిన కార్యక్రమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం , జిల్లా అధికారులు అలసత్వం ప్రదర్శించారని , కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా అధికారిక కార్యక్రమంలా వేడుకలు నిర్వహించలేదని, మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మాట్లాడకపోవడం లాంటి విషయాలు రజకుల ఆగ్రహానికి కారణమైంది. ఈ సందర్భంగా రజక నేతలు అధికారుల వద్ద నిరసన తెలుపుతుండగా ఓ వ్యక్తి అనవసరంగా కలగజేసుకొని మాట్లాడడంతో గొడవ కాస్త ముదిరింది. రజక నేతలు అనవసరంగా వివాదం సృష్టించడానికి వచ్చిన వ్యక్తిపై చేయి చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసన సమయంలో వీరనారి చిట్టెల ఐలమ్మను, రజక జాతిని వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, రజక యువ నేత మహేష్‌పై కొందరు దుండగులు భౌతిక దాడికి పాల్పడ్డారని కరీంనగర్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు రాచకొండ నరేష్ కరీంనగర్ పోలీసులకు ఆదివారం రోజున ఫిర్యాదు చేశారు. అలాగే చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాచకొండ నరేష్ మాట్లాడుతూ రజకులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని , చాకలి ఐలమ్మ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించిన తీరు మమ్మల్ని తీవ్రంగా బాధించిందన్నారు. అంతేకాకుండా అనవసరంగా ఓ వ్యక్తి కలగజేసుకొని చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అగౌరవపరిచే రీతిలో వ్యవహారాలు చేస్తే , మా జాతి చూస్తూ ఊరుకుండాలా అని ప్రశ్నించారు. అనవసరంగా జయంతి వేడుకల్లో కలుగజేసుకొని గొడవకు కారణమైన కాంగ్రెస్ నేత జెల్లిపోతుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జయంతి వేడుకల్లో రజక సంఘం నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారని, ఈ వేడుక ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాకపోయినా, కాంగ్రెస్ , బీజేపీ పార్టీల మధ్య గొడవ గా చిత్రీకరించడం భావ్యం కాదన్నారు. ముఖ్యంగా రజక జాతి టార్గెట్ గా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా నిన్న టి ఘటన పైన కాంగ్రెస్ చెందిన ఓ వ్యక్తితో ఎస్సీ అ ట్రాసిటీ చట్టం కింద రజక నేతలపై అక్రమ కేసులు పెట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ కేసులను వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోకపోతే , రజకుల ఐక్యత సత్తా ప్రభుత్వానికి చాటి చెబుతా మని ఆయన హెచ్చరించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

- జాడిమల్కాపూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం...
- OTP, UPI మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన...
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచనలు...

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం జాడిమల్కాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ రవి, చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వినయ్ కుమార్, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి పాల్గొని గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, OTP, UPI మోసాలు, అనుమానాస్పద లింకుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరితోను OTP, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని తెలిపారు. గ్రామంలో CCTV కెమెరాల ఏర్పాటు, వాటి వినియోగం, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు.అలాగే మైనర్లకు వాహనాలు నడపనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలు, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు కలిపి సుమారు 100 మంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మునుగోడు,సెప్టెంబర్ 27 (వెలుతురు): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ వరుకుప్పల ముత్యాలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర లింగయ్యయాదవ్, వంపు యాదయ్య, చల్మెడ లింగస్వామి, ఎర్ర అరుణ, పందుల సంపూర్ణ, సుజాత, సాంబ, దప్పు సరిత, సోలిపురం యాదయ్య, జీడిమడ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ
25 ఏళ్ల పరిపాలనకు నిదర్శనం సేవా సంకల్ప అభియాన్

- రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్.

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 27: ప్రధాని నరేంద్ర మోడీ సుదీర్ఘకాలంగా దేశానికి, ప్రజలకు అందిస్తున్న నిరంతర సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. 25 సంవత్సరాల ప్రజా సేవ పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్ లో బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభం చేశారు. అనంతరం రక్తదానం చేసిన పలువురు బీజేవైఎం నాయకులకు పండ్ల రసం అందించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత్వంతో చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా బీజేవైఎం నాయకులు, యువకులు, మోడీ అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమమే ద్యేయంగా గత 25 ఏళ్ల పాటు నరేంద్ర మోడీ అహర్నిశలు శ్రమిస్తూ... పని చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వం, మార్గనిర్దేశంలో భారతదేశం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధిస్తుందని తెలిపారు. నరేంద్ర మోడీ తిరుగులేని నాయకుడిగా 25 ఏళ్ళ పాటు ప్రజా సేవ ప్రపంచ దేశాలకు ఆదర్శం అన్నారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా యువత సామాజిక సేవలో ముందుండాలని పిలుపు నిచ్చారు. మోడీ సేవలను స్ఫూర్తిగా తీస్కోని... రక్తదానంతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి ప్రజలకు సేవలందించాలని పిలుపు నిచ్చారు. మోడి ఆశయాలను స్ఫూర్తిగా తీస్కొని బీజేవైఎం నాయకులు ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో కూడ నరేంద్ర మోడీ నాయకత్వంలో ఇలాగే ఎల్లప్పుడు కొనసాగేలా...దేశ ప్రజలకు మరింత సేవ చేసేలా భగవంతుడు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు. నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి బాట పట్టిందని... ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు లబ్ధిచేకూరుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మోడి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ఇంకా అభివృద్ధి చేంది... గొప్ప ప్రగతిని సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి కార్పోరేటర్లు చొప్పరి జయశ్రీ, పొన్నం లక్ష్మి మొండయ్య, మాసం గణేష్, గాజ రమ శివరాం, ఎన్నం లక్ష్మి ప్రకాష్, బీజేపి నాయకులు గుజ్జు శ్రీనివాస్, అవదుర్తి శ్రీనివాస్, చంద్రమౌళి, ఆనంద్, శివరాజ్, గాయత్రి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోరు వేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం

కౌడిపల్లి వెలుతురు సెప్టెంబర్ 27: మండల కేంద్రంలోని 9వ వార్డు, 10 వ వార్డు లలో సర్పంచ్ కృష్ణా గౌడ్ బోరు వేయించి తాగు నీటి సమస్యను పరిష్కరించారు. దీనితో కాలనీవాసులు తాగునీటి సమస్యను తీర్చినందుకు కృతజ్ఞతలు

తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు మక్బూల్, లక్ష్మి శరత్, బొంతమ్మ సంగప్ప, దేవేందర్, నాయకులు రాగుల భూమయ్య పటేల్, కారోబార్ ఎల్లం, స్థానికులు యాదగిరి, శివ రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకట్రావుపేట్ బూర్జుల వద్ద ముగ్గుల పోటీలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్

కౌడిపల్లి వెలుతురు సెప్టెంబర్ 27: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకట్రావుపేట్ గ్రామంలో సర్పంచ్ కుతుబుద్దీన్ ఆధ్వర్యంలో బూర్జుల వద్ద అందరికీ ముగ్గుల పోటీలు, కోలాటాలు ఆడించి వారికి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజే

ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

యడం ఎంతో అభినందనీయమని కొనియాడారు . ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రామారావు, వార్డు సభ్యులు చెంబుని రాజు, నాయకులు భూ లక్ష్మయ్య, శ్రావణ్ కుమార్, శశి, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాకు కండ్లు కనబడతలేవయ్యా అని ఒకరంటే..నీ వల్లే కండ్లు ఆపరేషన్ చేయించుకుంటున్నయ్యా అంటూ మరొక తల్లి మురిపెపు ముచ్చట

- మమ్మల్ని పెద్దకొడుకు లెక్క చూసుకుంటున్నవంటూ చనువుతో రాజ్ గోపాల్ రెడ్డి చేతిని తాకాలని ముడుతలు పడ్డ ప్రతి చేయి ఆరాటం
- నారాయణ పూర్ మండల కేంద్రంలో 17 వవిడత ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆత్మీయ పలకరింపులు ఆరోగ్యం పై ఆరాలతో ముసలోళ్లతో ముచ్చటించిన రాజ్ గోపాల్ రెడ్డి

నారాయణ పూర్ వెలుతురు సెప్టెంబర్ 27:

తన మాత్రుమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గంలో ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దనే సదుద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు నియోజకవర్గ వ్యాప్తంగా మంచి స్పందన వస్తోంది..ఇప్పటి వరకు 16 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 12306 మందికి కంటి పరీక్షలు చేయించి 2673 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేసి, 5522 మందికి కండ్ల జోళ్లు పంపిణీ చేశారు...ఆదివారం రోజున 17 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సంస్థాన్ నారాయణ్ పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు..ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గౌరవ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు జ్యోతి ప్రజ్వలన చేసి తన మాత్రుమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంబించారు...మొత్తం 5 కౌంటర్లలో కండ్లను పరీక్షించుకుంటున్న వృద్దులను , మహిళలను ఆత్మీయంగా పలకరిస్తూ వైద్య శిబిరం జరుగుతున్నతీరును పరిశీలించారు..ఆపరేషన్లకు ఎంపికైన వృద్దులను వృద్ధ మహిళలను ఆత్మీయంగా పలకరిస్తూ నేనున్నానని భరోసా ఇచ్చారు.. ఒక వృద్ధ మహిళకు బీపీ పెరుగుతున్న తీరును చూసి ఆమెను కూర్చొబెట్టుకుని దగ్గరుండి పరీక్షలు చేయించారు..వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి భోజన సదుపాయం కల్పించి ప్రతి ఒక్కరు తిన్నారా లేదా అని దగ్గరుండి చూసుకున్నారు.. ఆదివారం రోజున జరిగిన 17 వవిడత కంటి వైద్య శిబిరంలో 976 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 183 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు..వీరిలో 111 మందిని వెంటనే హైదరాబాద్ లోని శంకరా కంటి ఆసుపత్రికి పంపించారు..ఫీనిక్స్ ఫౌండేషన్ , శంకరా కంటి ఆసుపత్రి వారి సహకారంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది

మూడు తరాల ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు బహుజనులు ఐక్యంగా ముందుకు సాగాలి

- పార్టీలకతీతంగా బీసీల ఓట్లు బీసీలే వేసుకున్నప్పుడే ఆయనకు నిజమైన నివాళి: జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమకారుడిగా స్వాతంత్ర సమరయోధుడిగా, తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో తన మంత్రి పదవిని సైతం లెక్కచేయకుండా రాజీనామా చేసిన గొప్ప ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం తపించిన బాపూజీ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనులు ఐక్యంగా ఉండి, పార్టీలకతీతంగా తమ రాజకీయ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీసీల ఓట్లు బీసీలే వేసుకుని, తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని సాధించుకున్నప్పుడే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని జాజుల లింగంగౌడ్ అన్నారు.బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన వాటా దక్కేలా బహుజన సమాజం ఐక్యంగా పోరాడాలని ఆయన కోరారు.

మాదాపూర్ డివిజన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

- జుబేదా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జగ్మోహన్ సింగ్

వెలుతురు హైదరాబాద్ మాదాపూర్ సెప్టెంబర్ 27:

మాదాపూర్ డివిజన్‌లోని నవభారత్ నగర్‌లో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర నాయకురాలు, ది ఉమెన్స్ ఆఫ్ గ్రీన్ పీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు జుబేదా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జగ్మోహన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హర్ప్రీత్, జస్పాల్ సింగ్, బీజేపీ నాయకులు బొంగు రఘు గౌడ్, షేక్ షాజహాన్, మహ్మద్ గజిని, శ్రీ బల్బీర్, రిద్వా ఖాదర్, సర్వర్ భాయ్, జూలీ, మహేందర్ యాదవ్, సైదులు, షేక్ షాబాజ్ అలీ, మహెముదా బేగం, అర్షియా, రహీమా బేగం, సఫియా, నస్రీన్, గౌరీ మియా, షేక్ భాష, షేక్ ముక్రం, నవాబుద్దీన్, షహీదా తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు

సూర్యాపేట వెలుతురు సెప్టెంబర్ 27:

ఉమ్మడి ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను పట్టభద్రులు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎం.జెడ్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జనసేన పార్టీని బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు అందకపోవడం, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. తనను శాసనమండలికి పంపితే పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిరియాల రామకృష్ణ, సాయి శిరీష, ఎడమ రాజేష్, సరికొప్పుల విజయలక్ష్మి , నాగేశ్వరరావు, రామగిరి శివసాయి, అరవింద్ కుమార్, పసుపులేటి రామారావు, సాయినాయుడు, ఏవీ రావు, అజయ్‌తో పాటు నాలుగు నియోజక వర్గాలకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మీలా మహదేవ్, మొరిశెట్టి లక్షాది

సూర్యాపేట వెలుతురు సెప్టెంబర్ 27:

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ ఐ హాస్పిటల్ అధ్యక్షుడు మీలా మహదేవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది సూచించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ లయన్స్ ఐ హాస్పిటల్‌లో మలక్‌పేట యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ఉచిత వైద్య శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలతో పాటు షుగర్, బీపీ, 2డీ ఎకో, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, గుండె, స్త్రీ, ఎముకలు, రక్తనాళాలు, సాధారణ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.వి. ప్రసాద్, వైస్ గవర్నర్లు కోడె సతీష్, గుడిపూడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, సెక్రటరీ పెండెం చంద్రశేఖర్, ట్రెజరర్ సి.హెచ్. శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ మిర్యాల సుధాకర్, వైస్ చైర్మన్ తోట శ్యాంప్రసాద్, పీఆర్వో రాచర్ల కమలాకర్, ప్రెసిడెంట్ యాదగిరి, చిలుముల సైదిరెడ్డి, మేనేజర్ తల్లాడ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

మోత్కూర్, సెప్టెంబర్ 27,వెలుతురు:

ఆదివారం నాడు మోత్కూర్ మండల శాఖ ఆధ్వర్యంలో దాచారం గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని టీవీ ద్వారా వీక్షించడం జరిగినది.ఈ సందర్భంగా ప్రధానమంత్రి దేశవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యం, సమాజంలో స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్న కార్యక్రమాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రజలతో పంచుకున్నారు.ప్రజలతో నేరుగా అనుసంధానమవుతూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల అనుభవాలు, విజయాలను దేశ ప్రజలతో పంచుకునే 'మన్ కీ బాత్' కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని బీజేపీ జిల్లా నాయకులు, మండల ఇంచార్జ్ గౌరు శ్రీనివాస్, అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల నర్సిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుంటి సతీష్, లేలాల బాల నర్సయ్య, రవీందర్ అంజయ్య లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడ వధూవరుల పరిచయ వేదికకు

అపూర్వ స్పందన 500 మందికి పైగా హాజరు

- కుటుంబ వ్యవస్థ బలోపేతానికి గోపా కృషి.
- వివాహ సంబంధాల్లో పరస్పర అవగాహనకు గోపా వేదిక
- కరీంనగర్‌లో గౌడ వధూవరుల పరిచయ కార్యక్రమం.
- కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడమే గోపా లక్ష్యం.
- గౌడ వధూవరుల పరిచయ వేదికను మరింత విస్తృతం చేస్తాం: డాక్టర్ బండి సాయన్న గౌడ్.
- కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి: డాక్టర్ బండి సాయన్న గౌడ్

కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 27:

గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా గౌడ వధూవరుల పరిచయ వేదికను కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీలో గల మాచర్ల గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 500 మందికి పైగా హాజరై విశేష స్పందన తెలిపారు. గోపా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీ అమరగాని నర్సయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ, ఆధునిక సమాజంలో కుటుంబ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెళ్లి చేసుకోబోయే యువతీ యువకులు ఒకరినొకరు ప్రత్యక్షంగా తెలుసుకుని, తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించడం ద్వారా మంచి సంబంధాలు ఏర్పడేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఎలాంటి ఫీజు లేకుండా, స్వచ్ఛందంగా గోపా ఆధ్వర్యంలో ఇలాంటి పరిచయ వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వివాహ సంబంధాలు కుటుంబాల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, సమన్వయంతో బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు గోపా ముందుంటుందని డాక్టర్ బండి సాయన్న గౌడ్ తెలిపారు. యువతకు, కుటుంబాలకు ఉపయోగపడే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించడం గోపా లక్ష్యాలలో భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోడూరి పరుశురాం గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు, గోపా జిల్లా కోశాధికారి పరకాల మురళి గౌడ్, గౌరవ సలహాదారు పార్వతీ నర్సయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కోడూరు మహేందర్ గౌడ్, దూలం తిరుపతి గౌడ్, నేరెళ్ల నాగయ్య గౌడ్, కోడూరి అనిల్ గౌడ్, గడ్డమీది రాజేశం గౌడ్, గుండ మల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంయుక్త కార్యదర్శులు రంగు దేవేందర్ గౌడ్, వంగ వెంకటయ్య గౌడ్, పంజాల మల్లేశం గౌడ్, పంజాల లచ్చయ్య గౌడ్, కార్యవర్గ సభ్యులు పిల్లి సత్తయ్య గౌడ్, గుర్రం ముత్తయ్య గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, గౌడిశాల శ్రీనివాస్ గౌడ్, బొమ్మ కవిత గౌడ్, మంద పరశురాం గౌడ్, దూలం అంజయ్య గౌడ్ తదితరులు హాజరయ్యారు. కె.ఆర్. గౌడ్స్ మ్యాట్రిమోనీ నిర్వాహకులు కన్నా సంతోష్ కుమార్ గౌడ్, మంచిర్యాల జిల్లా కోశాధికారి దర్గం రాజేశం గౌడ్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య గౌడ్, కోశాధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గోపా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరిచయ వేదిక ద్వారా అనేక కుటుంబాలకు పరస్పర పరిచయం ఏర్పడటంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలనే ఉత్సాహం నిర్వాహకుల్లో నెలకొంది.

నేను వేశ్యనైతే..?

"ఒక వేశ్య శరీరాన్ని అమ్మవచ్చు కానీ మనసును కాదు - ఆమె ఎవరో కాదుఆమె కూడా మనమే"

శరీరాన్ని తాకట్టు పెట్టి కన్నబిడ్డల కడుపులు నింపుకునే మహిళా మణులెందరో ఈ దేశంలో.

వేశ్య వృత్తి అమ్మానాన్నల జోలె నుంచి కాదు ఆకలితో బతికే సత్యం నుంచి పుట్టింది. నిందించాల్సింది ఆమెను కాదు ఆమెను అక్కడ ఆ నిలబెట్టిన పరిస్థితులను.

ఈ నాగరిక వ్యవస్థలో వేశ్య వృత్తి కొన్ని దేశాల్లో కొన్ని సమాజాల్లో సర్వసాధారణమైతే మరి కొన్ని దేశాల్లో ప్రాంతాల్లో ఇది అపవిత్రమైనది తక్కువగా పరిగణించబడుతుంది.

వేశ్య అంటే డబ్బు లేదా ఇతర లాభాల కోసం శారీరక సంబంధాలు కలిగించే మహిళగా సామాజికంగా నిర్వచించబడుతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఒక పురాతన వృత్తి. కొన్ని సమాజాల్లో ఇది గౌరవపూర్వకంగా చూసే వృత్తి కాగా, మరికొన్ని సమాజాల్లో తక్కువగా పరిగణించబడుతోంది. వేశ్య వ్యవస్థకి సంబంధించిన చరిత్ర, కారణాలు, పరిస్థితులు, సామాజిక దృష్టికోణం, సమస్యలు మరియు పరిష్కారాలను వివరంగా తెలుసుకోవడం అవసరం.

వేశ్యావృత్తి అనేది మనుషుల నాగరికతకు తోడు వచ్చిన వృత్తిగా చరిత్రకారులు భావిస్తారు. మానవుల మధ్య లైంగిక ఆకాంక్షల వల్ల, కొన్ని సమాజాల్లో వేశ్యలు పూజారుల్లా గౌరవించబడే స్థితిలో ఉండేవారు.

ప్రభుత్వం వారికి మానవ హక్కులు, జీవనోపాధి హక్కు, ఆరోగ్య హక్కు, విద్య హక్కు ఉండేలా ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలి.

పోలీసుల వేధింపులకు, లైంగిక హింసకు గురికాకుండా ప్రత్యేక న్యాయ పరిరక్షణ (legal aid) అందించాలి.

వేశ్యల పిల్లల కోసం విద్యా బృందాలు, హాస్టళ్లు, స్కాలర్షిప్‌లు ఏర్పాటు చేయాలి.

మానవ అక్రమ రవాణాను (Human Traf - ficking) పూర్తిగా అణచివేయడంలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా కొత్త చట్టాలు రూపొందించాలి.

మద్యం ప్రదేశాల నిర్వహణ, బాలల వేశ్యావృత్తి లాంటి వాటికి శిక్షలు కఠినతరం చేయాలి.

ట్రాఫికర్లు, మధ్యవర్తులకు కఠిన శిక్షలు అమలు చేయాలి.

వేశ్య అవ్వడానికి ప్రధాన కారణాలు:

1. పేదరికం: జీవనోపాధి లేక, కుటుంబాలను పోషించాలన్న బాధ్యతతో కొన్ని మహిళలు వేశ్యావృత్తిని ఎంచుకుంటారు.

2. అనాథత్వం: చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మానవ అక్రమ రవాణాకు గురై ఈ వృత్తిలోకి బలవంతంగా లాగబడతారు.

3. ఆశ్రమం మరియు ఉద్యోగావకాశాల లోపం: విద్యాభావం వల్ల ఏ వృత్తినైనా పొందలేక, చివరికి ఈ మార్గం వైపు మొగ్గుతారు.

4. బలవంతపు వ్యభిచారం: చాలా సార్లు మహిళలు అక్రమ మానవ రవాణా మాఫియాల వలలో పడతారు.

5. సామాజిక వివక్ష: నిరాదరణ పొందిన, వలసబద్ద వర్గాల నుండి వచ్చిన మహిళలు వేశ్యావృత్తిలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నేను వేశ్య నైతే.. ఒకవేశ్య అంతరాంగిక అంతర్మధన ఆవేదన..

నీ కామం అనే ఆకలికి నేను ఆహారం, నీ లైంగిక వాంఛను తీర్చే ఓ ముడి సరుకును, నీ శారీరక కోరికకు నన్ను నేను సమర్పించుకునే ఓ త్యాగిని.

ఈ సమాజంలో నేను ఎదుర్కొన్న పరిస్థితులే, సమస్యలే నన్ను ఈ నాలుగు గోడల మధ్యన సింగారించిన నల్లరాతి లాగా వ్యభిచారిని అనే ఒక దోషి లాగా నీ కామ కోరికల ముందు ఒక కీలుబొమ్మలాగా నన్ను నిలబెట్టింది.

నేను ఎవరిని నిందించాలి..? నా అంతరాత్మనా నన్ను ఈ కూపంలోకి నెట్టిన ఈ పరిస్థితులనా లేక నన్ను పోషిస్తున్న ఈ పురుషాధిక్య సమాజాన్నా..? ఎవరిని నిందించినా కూడా దోషినైతే నేనే కదా..!

నా బిడ్డల ఎండిన డొక్కలు నన్ను ప్రశ్నిస్తున్నాయి నా కొంపలో ఖాళీ కుండలు నన్ను వెక్కిరిస్తున్నాయి

అగ్నిసాక్షిగా నా మెడలో మంగళసూత్రం కట్టి తనలో కలుపుకున్న నా అర్ధభాగం (భర్త) గమ్యం తెలవని నన్ను రెండు కాళ్ల జంతువులు ఉండే ఈ నాగరిక అడవిలో వదిలి నా చేత శత్రువు తెలియని యుద్ధం చేయిస్తున్నాడు నా జనన మర్మాంగాలతో వ్యాపారం చేయిస్తున్నాడు వెలకట్టలేని గర్భాలయాన్ని తూకం వేస్తున్నాడు.

నా శరీరం నాకు ఎముకల గూడు కానీ అతనికి మాత్రం పట్టు పాన్పు. నేను క్షతఘాతురాల్ని శారీరక రోగినే కాదు మానసిక రోగిని కూడా నా స్వేద రంధ్రాల గుండా శ్రవించే స్వేదం, నా నేత్రాల నుండి ఉద్భవించే నా కన్నీరు, శరీరం నుంచి ఉట్టిపడే నెత్తుటి మరకలు వీటన్నింటి కలయికగా నన్ను నన్నుగా చూసేది నన్ను మోస్తున్న నేను నిలబడుతున్న ఈ భూమి మాత్రమే అనుకుంటా.

ఈ నిశ్శబ్ద సమాజంలో నేనో నిషాధిని.. శాంతి ప్రేమికులు, శాంత కాముకులు ఈ నిషాధికి నిలువ నీడనిద్దురా..? ఈ నిగూఢ సమాజాన్ని నిశ్శబ్దం చీకటి అలుముకున్నది. సమాజం ఈ నిశ్శబ్దాన్ని వీడేదెన్నడో..!

నా శరీరం మలినమైతదేమో కానీ నా మనసు ఎప్పటికీ పవిత్రమే..! నేను ఎవరినో కాదు నేను నువ్వే, నన్ను నిందిస్తే నిన్ను నువ్వు నిందించుకున్నట్టే.

స్థిరత్వం లేని జీవితం నాది నిలకడ లేని బ్రతుకు నాది. నేను గబ్బిలం లాంటి దాన్ని పగలంతా విశ్రాంతిలో ఉంటాను రాత్రిపూట పొట్టకూటి కోసం తిప్పలు పడతాను నా ఎదలో సేద తీరేందుకు అల్లాడిపోయే కాముకులు ఎందరో వారికి నా ఈ మాంసపు ముద్దతో పని తప్ప నా మనసుతో ఏం పని..?

నా జీవితానికి ముగింపు పలుకుదాం అంటే పలక లేని పరిస్థితులు పలకనివ్వని బాధ్యతలు నేను పరుగుపందెంలో పరుగెత్తే అశ్వమేధాన్ని నేను పరిగెత్తగలిగినంత వరకే ఈ పందెంలో పోటీ దారును నా మాంసపు ముద్ద కుషించుకుపోయిన నాడు నన్నేం చేస్తారో నేనేమైపోతానో నాకే తెలియదు. గాలిలోని దీపం లాంటిదాన్ని ఆ గాలి నాకు ఊపిరి ఆ గాలే నా పాలిట యమపాశం కూడ.

మాకు ఆశయాలు ఆకాంక్షలు వంటివి ఏం ఉండవు కోరికలు వాంఛలు కూడా ఉండవు మాకు ఆస్తిపాస్తులు కూడా ఏమీ ఉండవు నా శరీరమే నా ఆస్తి, రక్త మాంసాలే పెట్టుబడి. మాకు ఉన్నదల్లా మేము కోరుకునేదల్ల ఒకటే మమ్మల్ని ఒక వింత ప్రాణిలా కాకుండా సాటి మనిషిగా చూస్తే చాలు. మా ఈ పోరాటానికి పిడికడు మెతుకులే సాక్ష్యం.

ఈద శేఖర్
-70369 97589

ఊరువాడా ఉత్సాహంగా.. అమ్మకు అక్షరమాల

- చదువుకు వయసు అడ్డంకి కాదని చాటిన 6 లక్షల వయోజనులు
- ఉల్లాస్ పరీక్ష రాసిన వయోజనులకు మంత్రి సీతక్క అభినందనలు
- లక్ష్యం చేరే వరకు అక్షరాస్యత ఉద్యమం కొనసాగిస్తాం – మంత్రి సీతక్క
- ఉల్లాస్‌లో ఉత్తీర్ణులైన వారికి పదో తరగతి పరీక్ష రాసే అవకాశం
- అర్హులైన ప్రతి ఒక్కరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి – మంత్రి సీతక్క
- మహిళల అక్షరాస్యతతో కుటుంబాల్లో వెలుగులు
- తెలంగాణలో నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం – మంత్రి సీతక్క

సంఘమిత్ర వివో ఉల్లాస్ పరీక్షలు జరుగుతున్నది సార్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

ఏళ్ల తరబడి అక్షరాలకు దూరంగా ఉన్న వయోజనులు ఇప్పుడు తమ జీవితాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. తెలుగు అక్షరాలను గుర్తించలేని స్థితి నుంచి చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్చుకున్న లక్షలాది మంది ఆదివారం 'ఉల్లాస్' పరీక్ష రాశారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో బాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్‌కు 6.32 లక్షల మంది వయోజనులు హాజరయ్యారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 5.32 లక్షల మంది మహిళలు, పట్టణ ప్రాంతంలో లక్ష మంది వరకు పరీక్ష రాశారు. రాష్ట్రంలోని 124 పట్టణ స్థానిక సంస్థల్లో (ULBs), అలాగే GHMC, MMC, CMC పరిధిలోని సర్కిళ్లలో పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్షకు 98,324 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, 720 మంది వీధి వ్యాపారులు హాజరై పరీక్ష రాశినట్లు, వయోజన విద్యాశాఖ సమన్వయంతో ఈ పరీక్షను నిర్వహించినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పరీక్ష రాసిన స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర వయోజన అభ్యాసకులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. "అక్షరం నేర్చుకోవడం అంటే కేవలం చదవడం, రాయడం రావడం కాదు.. అది ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవడం. ఇంతకాలం వేలిముద్రతో తమ అవసరాలను పూర్తి చేసుకున్న మహిళలు ఇకపై తమ పేరును తామే రాసుకునే స్థాయికి రావడం ఒక గొప్ప మార్పు. చదువుకు వయసు లేదు.. నేర్చుకోవాలన్న సంకల్పమే ముఖ్యం" అని మంత్రి సీతక్క అన్నారు.చిన్న వయసు లోనే పెళ్లిళ్లు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి కోసం ఎదురైన పరిస్థితులు కారణాలతో చదువుకు దూరమైన మహిళలు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. జీవితంలో ఏ దశలో చదువు ఆగిపోయినా, మళ్లీ అక్కడి నుంచే విద్యను కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోం దన్నారు. "ఒక మహిళ అక్షరాస్యురాలైతే ఒక్క వ్యక్తి మాత్రమే చదువుకున్నట్టు కాదు.. ఒక కుటుంబానికి వెలుగు వస్తుంది. ఆమె తన పిల్లల చదువును పట్టించుకుంటుంది, బ్యాంకు లావాదేవీలను అర్థం చేసుకుంటుంది, ఆరోగ్యం గురించి తెలుసుకుంటుంది, ప్రభుత్వ పథకాలను స్వయంగా తెలుసుకుని వినియోగించుకోగలుగుతుంది. అందుకే మహిళా అక్షరాస్యతను కేవలం విద్యాశాఖ కార్యక్రమంగా కాకుండా సామాజిక మార్పు ఉద్యమంగా చూడాలి" అని సీతక్క స్పష్టం చేశారు.

గ్రామంలోనే చదువు.. ఖర్చు లేకుండా విద్య

తెలంగాణ ప్రభుత్వం 'అమ్మకు అక్షరమాల' పేరుతో అక్షరాస్యతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ అక్షరాస్యత కార్యక్రమాలను అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి, వారి నివాస ప్రాంతాల్లోనే విద్యను అందించేలా చర్యలు చేపడుతోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో ఈ ప్రయత్నాలకు మరింత ఊతమిస్తోంది. విద్య కోసం మహిళలు ప్రత్యేకంగా ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే అభ్యసించే అవకాశం కల్పిస్తున్నారు. ఎటువంటి ఫీజు లేకుండా అక్షరాస్యతను అందించడం ద్వారా చదువు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.2025–26 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది నిరక్షరాస్యులుగా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 13 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులకు 100 రోజులపాటు విద్యా కేంద్రాల్లో ఈ ఏడాది శిక్షణ అందించారు. అభ్యాసకుల కోసం ప్రభుత్వం 'అక్షర వికాసం' పేరుతో ప్రత్యేక పుస్తకాలను రూపొందించి అందించింది. తెలుగు అక్షరాలు చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం, కూడికలు, తీసివేతలతో పాటు రోజువారీ జీవితానికి అవసరమైన అనేక అంశాలను ఈ పుస్తకాల ద్వారా నేర్పించారు.

మార్చి పరీక్షలో 5.20 లక్షల మంది ఉత్తీర్ణత

ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి నెలలో 6.29 లక్షల మంది చదవడం, రాయడం, లెక్కలపై పరీక్ష రాశారు. జూన్‌లో విడుదలైన ఫలితాల్లో 5.21 లక్షల మంది వరకు ఉత్తీర్ణులయ్యారు. వారికి జాతీయ సార్వత్రిక విద్యాపీఠం నుంచి అక్షరాస్యత ధ్రువీకరణ పత్రాలు అందాయి. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నాడు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షకు 6.32 లక్షల మందికి పైగా హాజరుకావడం ద్వారా అక్షరాస్యత కార్యక్రమంపై వయోజనుల్లో పెరుగుతున్న ఆసక్తి స్పష్టమవుతోందని అధికారులు తెలిపారు.

అక్షరాస్యతతో పాటు తదుపరి విద్యకు అవకాశం

ఉల్లాస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి భవిష్యత్‌లో విద్యను కొనసాగించేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు పదో తరగతి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (TOSS)లో ప్రవేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో, మహిళలు పెద్ద సంఖ్యలో ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు.తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ తదితర భాషల్లో సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఉందని, కుట్టు, కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ వంటి వృత్తి కోర్సులను కూడా అదనంగా నేర్చుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సమీపంలోని మీసేవ కేంద్రం లేదా TOSS స్టడీ సెంటర్‌ను సంప్రదించడంతో పాటు telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు."మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం కూడా అంతే ముఖ్యం. చేతిలో పొదుపు పుస్తకం ఉండాలి.. అదే సమయంలో దానిలో ఏముందో చదివే అక్షరజ్ఞానం కూడా ఉండాలి. ప్రభుత్వ పథకం ఏమిటో తెలుసుకునే హక్కు, తన హక్కులను చదివి అర్థం చేసుకునే శక్తి ప్రతి మహిళకు ఉండాలి" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక సాధికారతను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ఇందిరా మహిళా శక్తి లక్ష్యమని ఆమె తెలిపారు. అక్షరాస్యత ఉద్యమం ఆగదు.. లక్ష్యం చేరే వరకు కొనసాగుతుంది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట వెలుతురు సెప్టెంబర్ 27:

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దేశానికి, తెలంగాణకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆయన కీలకంగా పనిచేశారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు అలుపెరగని కృషి చేశారని పేర్కొన్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన ముఖ్య భూమిక పోషించారని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ పేర్కొన్నారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఆర్ఐ జానయ్య, క్లూస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో విషాదం.. పాముకాటుతో మహిళ మృతి

వికారాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:



జిల్లలో విషాదం చోటు చేసుకుంది. పాముకాటుతో మహిళా కూలీ మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన తాండూరు మండలం మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..అంబిక అనే మహిళా కూలీ కంది చేనులో కలుపు తీసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అంబిక మృతితో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.

మేడిగడ్డకు పూర్తి స్థాయి డయాఫ్రం వాల్ అవసరం కావచ్చు: ఉత్తమ్

- బ్యారేజీ ఒక చివరి నుంచి మరో చివరి వరకు నిర్మించే ప్రతిపాదనపై పరిశీలన
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో స్టిల్లింగ్ బేసిన్ల బలోపేతం
- రెండు, మూడు వారాల్లో తుది డిజైన్లు
- నవంబర్ లేదా డిసెంబర్‌లో పనులు ప్రారంభించి 2027 జూన్‌లోగా పూర్తి
- ఎల్‌నినో ప్రభావంలోనూ 340 టీఎంసీల గోదావరి జలాల వినియోగం
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇదే అత్యధికం
- తుమ్మిడిహట్టిని వదిలేయడంతో 165 టీఎంసీల నీటిని కోల్పోయాం

హుజూర్‌నగర్, వెలుతురు సెప్టెంబర్ 27:

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పునాదులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించేందుకు ఒక చివరి నుంచి మరో చివరి వరకు డయాఫ్రం వాల్ నిర్మించాల్సి రావచ్చని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్లను బలోపేతం చేసి, మరింత పొడిగించాల్సిన అవసరం కూడా ఉందన్నారు.హుజూర్‌నగర్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ, గోదావరి జలాల వినియోగంపై కీలక వివరాలు వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ పునాదుల కింద నుంచి నీటి చొరబాటును నియంత్రించి, పునాదులకు దీర్ఘకాలిక భద్రత కల్పించేందుకు బ్యారేజీ మొత్తం వెడల్పునా డయాఫ్రం వాల్ నిర్మించే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. ఒక చివరి నుంచి మరో చివరి వరకు నిర్మించే ఈ గోడ ద్వారా పునాదుల రక్షణ మరింత పటిష్ఠమవుతుందని సాంకేతిక నిపుణులు భావిస్తున్నట్లు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన వరద నీటి ఉధృతిని తగ్గించే స్టిల్లింగ్ బేసిన్లను కూడా బలోపేతం చేయాల్సి ఉంటుందన్నారు. భారీగా వచ్చే వరద నీటి వేగాన్ని నియంత్రించి, బ్యారేజీల దిగువ భాగంలో కోత ఏర్పడకుండా ఉండేందుకు ప్రస్తుతం ఉన్న స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. "మేడిగడ్డ బ్యారేజీకి ఒక చివరి నుంచి మరో చివరి వరకు డయాఫ్రం వాల్ నిర్మించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. మూడు బ్యారేజీల వద్ద వరద నీటి వేగాన్ని అదుపు చేసేందుకు స్టిల్లింగ్ బేసిన్లను బలోపేతం చేసి పొడిగించాల్సి రావచ్చు" అని మంత్రి వివరించారు. అయితే, ఇవి ప్రస్తుతం సాంకేతిక పరిశీలనలో ఉన్న ప్రతిపాదనలేనని, తుది డిజైన్ నివేదిక వచ్చిన తర్వాత చేపట్టాల్సిన పనులపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఐఐటీ బాంబే, అంతర్జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఏఎఫ్ఆర్‌వై ఇండియా పరీక్షల నివేదికలను అధ్యయనం చేసి మరమ్మతులు, పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నాయని తెలిపారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచించిన మట్టి, కాంక్రీట్, పునాదులకు సంబంధించిన పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. ఈ పరీక్షల ఫలితాలను డిజైన్ సంస్థలు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి బ్యారేజీ వద్ద చేపట్టాల్సిన నిర్మాణ పనులను ఖరారు చేస్తాయని పేర్కొన్నారు. రెండు, మూడు వారాల్లో తుది డిజైన్ నివేదిక అందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నవంబర్‌లో లేదా ఆలస్యమైతే డిసెంబర్‌లో పునరుద్ధరణ పనులు ప్రారంభించి, వచ్చే వర్షాకాలానికి ముందే 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కొత్త నిర్మాణాన్ని చేపట్టడం కంటే దెబ్బతిన్న బ్యారేజీలకు మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం సాంకేతికంగా అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని చెప్పారు. అయినప్పటికీ తెలంగాణ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మూడు బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ, అవసరమైనచోట పునర్నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యారేజీల్లో లోపాలకు కారణాలను గుర్తించడంతోపాటు శాశ్వత పరిష్కారాలను సూచించేందుకు దేశీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణుల సహాయం తీసుకుందని తెలిపారు. పార్లమెంట్ చేసిన జాతీయ ఆనకట్టల భద్రతా చట్టం కింద ఏర్పాటైన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మూడు బ్యారేజీలను పరిశీలించి విస్తృత సాంకేతిక పరీక్షలను సూచించిందన్నారు. "ఈ విషయంలో మాకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. అత్యుత్తమ ఇంజినీరిం గ్ పరిష్కారాలతో మూడు బ్యారేజీలను మరమ్మతు చేసి, తిరిగి పూర్తిస్థాయిలో పనిచేసేలా చేయడమే మా లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

గోదావరి జలాల వినియోగంలో సరికొత్త రికార్డు

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గినప్పటికీ 2025–26లో తెలంగాణ రికార్డు స్థాయిలో 340 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒకే సంవత్సరంలో గోదావరి జలాలను ఈ స్థాయిలో వినియోగించుకోవడం ఇదే తొలిసారి అని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన పదేళ్ల పాలనలో ఏ ఒక్క సంవత్సరంలోనూ ఇంత భారీగా గోదావరి నీటిని వినియోగించుకోలేకపోయిందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను రైతుల అవసరాలకు మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. "ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ ఏడాది తెలంగాణ 340 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకుంది. రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యధిక వినియోగం" అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రస్తుతం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న లోపభూయిష్టమైన నిర్ణయాలు కూడా కారణమని విమర్శించారు. మూల ప్రణాళిక ప్రకారం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి

ఉంటే ప్రాణహిత జలాలను నిల్వ చేసి, సుమారు 165 టీఎంసీల నీటిని ఉత్తర తెలంగాణ అవసరాలకు వినియోగించే అవకాశం ఉండేదన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును పూర్తి చేయకుండా దానిని మేడిగడ్డకు మార్చారని, అక్కడ నిర్మించిన బ్యారేజీల్లో తీవ్రమైన నిర్మాణ లోపాలు బయటపడ్డాయని చెప్పారు. మేడిగడ్డ ప్రాంతాన్ని ఎంపిక చేసింది, ప్రాజెక్టుకు డిజైన్ రూపొందించింది, బ్యారేజీలను నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. "మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమే. దానికి డిజైన్ చేసి నిర్మాణం చేపట్టింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నది సైతం బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే. ఇప్పుడు ఆ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల జరిగిన నష్టాన్ని సరిదిద్దుతూనే, కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను వినియోగించుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

జమ్మికుంటలో ఘనంగా కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- రక్తదాన శిబిరం ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

జమ్మికుంట, వెలుతురు సెప్టెంబర్ 27:

జమ్మికుంట పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ఉద్యమకారుడు, పద్మశ్రీ కోండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం: సాయిని మల్లేశం

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. కోండా లక్ష్మణ్ బాపూజీ జీవితం దేశానికి, భావితరాలకు ఎనలేని స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన అడుగుజాడలు ప్రాతఃస్మరణీయమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సేవా సంకల్ప అభియాన్ బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ....

'సేవా సంకల్ప అభియాన్' ప్రోగ్రాంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం లభిస్తుందని, యువత రాజకీయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ

25 ఏళ్ల పాలన సందర్భంగా నెల రోజులపాటు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తదనంతరం బిజెపి శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ప్రధాని మోదీ మన్ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి., జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, బైరెడ్డి వెంకట రమణారెడ్డి, పుప్పాల రఘు, నరసింహ రాజు, టంగుటూరి రాజ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RRC దక్షిణ రైల్వేలో ఉద్యోగాలు.. అక్టోబర్ 18 వరకు దరఖాస్తుకు అవకాశం!

చెన్నైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (RRC), దక్షిణ రైల్వే పరిధిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026–27 సంవత్సరానికి దక్షిణ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ICF)లోని లెవెల్–1, లెవెల్–2 పోస్టులను 'భారత్ స్కౌట్స్ & గైడ్స్' కోటా కింద భర్తీ చేయనుంది. భారతీయ పౌరులు, 'భారత్ స్కౌట్స్ & గైడ్స్'లో యాక్టివ్ మెంబర్‌షిప్ ఉన్న అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు అక్టోబర్ 18, 2026 చివరి తేదీ. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 17 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. లెవెల్–2 పోస్టులు 3, లెవెల్ 1 పోస్టులు 14 వరకు ఉన్నాయి.పోస్టును బట్టి గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10వ తరగతి/ఐటీఐ లేదా 12వ తరగతి (10+2) ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. అదనంగా 'భారత్ స్కౌట్స్ & గైడ్స్'కు సంబంధించిన నిర్దేశిత అర్హతలు కలిగి ఉండాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 33 సంవత్సరాల మధ్య ఉండాలి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం రిజర్వేషన్ కేటగిరీలకు వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుంది. అర్హత గల అభ్యర్థులు దక్షిణ రైల్వే/ఆర్‌ఆర్‌సీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే ముందు విద్యార్హత, వయోపరిమితి, స్కౌట్స్ & గైడ్స్ అర్హతలు, ఇతర నిబంధనలను అధికారిక నోటిఫికేషన్‌లో పూర్తిగా పరిశీలించాలి. అభ్యర్థుల ఎంపిక రాత పరీక్ష ఆధారంగా జరుగుతుంది. స్కౌట్స్ & గైడ్స్‌కు

సంబంధించిన అర్హతలు, సర్టిఫికెట్ల పరిశీలన వంటి ప్రక్రియలు కూడా నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఉంటాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టును బట్టి నెలకు రూ.20,000 నుంచి రూ.25,000 వరకు బేసిక్ పే లభిస్తుంది. దీనికి నిబంధనల ప్రకారం ఇతర అలవెన్సులు వర్తిస్తాయి.

జొమాటో స్కాం.. బిర్యానీ రాలేదు.. డబ్బులు తిరిగి రాలేదు!

- ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్‌లో వినియోగదారుడికి చేదు అనుభవం
- దిల్‌సుఖ్‌నగర్‌లోని 'శ్రీ అభిరుచి బిర్యానీ అండ్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్'పై ఆరోపణలు
- ఆర్డర్ క్యాన్సిల్.. రీఫండ్ మాత్రం నిల్!
- రెస్టారెంట్ ఫోన్‌కు స్పందన లేదంటున్న బాధితుడు
- ఆన్‌లైన్‌లో నమోదైన ఫుడ్ సెంటర్ల లైసెన్సులపై తనిఖీలు ఎప్పుడు?

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 27:

ఆన్‌లైన్‌లో ఆహారం ఆర్డర్ చేస్తే నిమిషాల్లో ఇంటి వద్దకే చేరుతుందన్న నమ్మకంతో వేలాది మంది ఫుడ్ డెలివరీ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆర్డర్ చేసిన సమస్య తలెత్తితే వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. ముందుగానే ఆన్‌లైన్‌లో చెల్లించిన డబ్బులు తిరిగి రాకపోవడం.. ఆహారం అందకపోవడం.. సమస్యను పరిష్కరించుకునేందుకు సరైన కస్టమర్ సపోర్ట్ అందు బాటులో లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. దిల్‌సుఖ్‌నగర్ లోని శ్రీ అభిరుచి బిర్యానీ అండ్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్ నుంచి జొమాటో ద్వారా చికెన్ బిర్యానీ ఆర్డర్ చేసిన ఓ వినియోగదారుడికి ఇలాంటి అనుభవమే ఎదురైంది. క్రెడిట్ కార్డు ద్వారా ముందుగానే ఆన్‌లైన్‌లో చెల్లింపు చేశారు. డెలివరీ దశకు చేరుకున్న తర్వాత కొన్ని కారణాల వల్ల ఆర్డర్‌ను తీసుకోలేని పరిస్థితి ఏర్పడటంతో దానిని రద్దు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆర్డర్ రద్దయినప్పటికీ చెల్లించిన మొత్తంగి రాలేదని బాధితుడు చెబుతున్నారు.

బిర్యానీ లేదు.. రీఫండ్ లేదు!

ఆర్డర్ రద్దు కావడంతో బిర్యానీ వినియోగదారుడికి అందలేదు. అదే సమయంలో ముందుగా చెల్లించిన డబ్బు కూడా తిరిగి రాలేదని ఆరోపిస్తున్నారు. రీఫండ్‌కు సంబంధించి యాప్‌లో స్పష్టమైన సమాచారం లేకపోవడంతో సమస్యను పరిష్కరించుకోవడం కష్టంగా మారిందని బాధితుడు వాపోయారు.

ఫోన్ నంబర్ ఉంది.. స్పందన మాత్రం?

జొమాటోలో కనిపించిన శ్రీ అభిరుచి బిర్యానీ అండ్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్ ఫోన్ నంబర్‌కు సంప్రదించేందుకు ప్రయత్నించినా సరైన స్పందన లభించలేదని బాధితుడు తెలిపారు. ఆన్‌లైన్‌లో రెస్టారెంట్ పేరు, ఫోన్ నంబర్ కనిపిస్తున్నప్పటికీ వాస్తవంగా రెస్టారెంట్ కార్యకలాపాలు

ఏ విధంగా కొనసాగుతున్నాయన్నది అధికారు లు పరిశీలించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

మూడోసారి ఇదే సమస్య!

ఇలాంటి అనుభవం తనకు ఇది మూడోసారి ఎదురవుతోందని బాధితుడు చెబుతున్నారు. ఒక్కోసారి వందలు, రెండు వందల రూపాయలే కావొచ్చని.. కానీ సామాన్యుడికి ఆ మొత్తమూ విలువైనదేనని పేర్కొన్నారు. ఆహారం అందకపోవడంతో పాటు చెల్లించిన మొత్తం తిరిగి రాకపోతే వినియోగదారుడు రెండువైపులా నష్టపోయే ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

లైసెన్స్ ఉందా?

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లలో నమోదైన ప్రతి రెస్టారెంట్, క్లౌడ్ కిచెన్, ఫుడ్ సెంటర్‌కు సంబంధిత ఆహార భద్రతా లైసెన్స్ ఉందా? నిబంధనలకు అనుగుణంగా ఆహారం తయారు చేస్తున్నారా? అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని వినియోగదారులు కోరుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో మాత్రమే కనిపించే ఫుడ్ సెంటర్ల వాస్తవ చిరునామాలు, వంటశాలల పరిశుభ్రత, ఆహార నాణ్యత, లైసెన్సులు, అనుమతులపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ వినిపిస్తోంది.

నాణ్యతపై ఎవరి బాధ్యత?

నాణ్యత లేని ఆహారం లేదా నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసిన ఆహారం వినియోగదారులకు చేరితే బాధ్యత ఎవరిది? రెస్టారెంట్‌దా? డెలివరీ సంస్థదా? లేక రెండింటిదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో రెస్టారెంట్ల నమోదుకు ముందు, ఆ కూడా లైసెన్సులు, ఆహార భద్రతా ప్రమాణాలను ధ్రువీకరించే వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉందని వినియోగదారులు అంటున్నారు.

రద్దయిన ఆర్డర్ల డబ్బుల లెక్క తేల్చాలి

ఒక ఆర్డర్‌లో వందలు మాత్రమే ఉండొచ్చు. కానీ రోజువారీగా వేలాది ఆర్డర్లు జరుగుతున్నాయి. వాటిలో రద్దయిన ఆర్డర్లు ఎన్ని? వాటికి వినియోగదారులకు ఎంత మొత్తం రీఫండ్ చేశారు? ఎంత మొత్తం రీఫండ్ కాలేదు? ఏ నిబంధనల ప్రకారం రీఫండ్ నిలిపివేస్తున్నారు? అనే వివరాలను పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం వినియోగదారులు కోరుతున్నారు.

అధికారుల దృష్టి సారించాలి

బిర్యానీ రాలేదు.. డబ్బులు తిరిగి రాలేదు.. సమస్య చెప్పుకునేందుకు సరైన మార్గం కనిపించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ అభిరుచి బిర్యానీ అండ్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్‌పై వచ్చిన ఫిర్యాదుతో పాటు జొమాటోలో నమోదైన ఫుడ్ సెంటర్ల లైసెన్సులు, ఆహార నాణ్యత, రీఫండ్ విధానంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్ సౌకర్యం పేరుతో వినియోగదారుడి డబ్బు, ఆరోగ్యం, హక్కులకు భద్రత లేకుండా పోకూడదన్నదే వినియోగదారుల డిమాండ్.

నాలుగు రోజుల పాటు బ్యాంకులు బంద్.. వచ్చే వారంలో సెలవులు ఇవే..

వచ్చే వారంలో బ్యాంకులు వరుసగా సెలవులు వచ్చాయి. సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 4 వరకు వరుస సెలవులు ఉన్నాయి. 28 నుంచి 30 వరకు బ్యాంక్ ఉద్యోగ సంఘాల సమ్మె కారణంగా వరుసగా మూడు రోజులు పాటు బ్యాంకులు బంద్ కానున్నాయి. ఇక గాంధీ జయంతి రానుండటంతో ఈ వారంలో బ్యాంకులకు ఎక్కువ రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ఖాతాదారులు దీనిని గమనించి ముందుగానే తమ లావాదేవీలను ప్లాన్ చేసుకోవడం మంచిది. సెలవులు గురించి ముందే తెలుసుని రోజువారీ లావాదేవీలను ప్లాన్ చేసుకోండి. నగదు అవసరాల కోసం బ్యాంక్ సెలవుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. వచ్చే వారంలో బ్యాంక్ సెలవుల గురించి డీటైల్డ్‌గా చూద్దాం.

వచ్చే వారంలో బ్యాంక్ సెలవులు ఇవే..

28 నుంచి 30 వరకు బ్యాంక్ ఉద్యోగుల సమ్మె కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉండవు. ప్రైవేట్ బ్యాంకులు తెరిచే ఉంటాయి. ఇక అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి వస్తుంది. ఆ రోజున జాతీయ సెలవు కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులన్నీ మూతపడాయి. దీంతో వచ్చే వారంలో మొత్తం నాలుగు రోజుల పాటు బ్యాంకులు ఉండవు. బ్యాంక్ ఖాతాదారులు దీనిని గమనించి ప్లాన్ చేసుకోవాలి.

ఏయే సేవలు నిలిచిపోతాయి..?

బ్యాంకులు మూతపడటం వల్లన నగదు డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్, కొత్త ఖాతాలు తెరవడం, డ్రాఫ్టులు, పాస్‌బుక్ అప్‌డేట్, లాకర్‌కు సంబంధించిన పనులు పూర్తిగా నిలిచిపోతాయి. పత్రాలను సమర్పణ లేదా ఇతర పరిపాలనా పనులు

ఆగిపోతాయి.

బ్యాంక్ లావాదేవీలు ఎలా చేసుకోవాలి..?

బ్యాంకు శాఖలు మూసి ఉన్నప్పటికీ.. ఆన్‌లైన్ సేవలు యథావిధిగా పనిచేస్తాయి. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. దీంతో చెల్లింపులు చేయడానికి, బిల్లులు చెల్లించడానికి, డబ్బు బదిలీ చేయడానికి ఈ విధానాలను ఉపయోగించుకోవచ్చు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ కూడా పనిచేస్తూనే ఉంటుంది. ఖాతాకు సంబంధించిన నిధుల బదిలీలు, ఇతర డిజిటల్ లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయి. ఏటీఎం సేవలు కూడా పనిచేస్తూనే ఉంటాయి. నగదు ఉపసంహరణ కోసం ఏటీఎంలను వినియోగించుకోవచ్చు. ఇక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిబంధనల ప్రకారం.. ఆర్టీజీఎస్, నెఫ్ట్ వంటి నిధుల బదిలీ సేవలు సంవత్సరంలో 365 రోజులు, రోజుకు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. కాబట్టి మీరు పెద్ద లావాదేవీలను వీటి ద్వారా నిర్వహించుకోవచ్చు.

ఖద్దరు వెనుక కన్నీటి తడి!

- రాజకీయం మోజులో జీవితాలు అతలాకుతలం
- దర్పం కోసం ఖరీదైన కార్ల కొనుగోలు
- ఆపై స్థాయికి మించి ఖర్చులు
- హారతి కర్పూరంలా కరిగిపోతున్న ఆస్తులు
- అప్పుల్లో కూరుకుపోతున్న చోటా, మోటా లీడర్లు

రాజకీయం మోజు ఎన్నో జీవితాలను అతలాకుతలం చేస్తోంది. పదవులు రాని వాళ్లే కాదు, పదవులు అనుభవిస్తున్న వారూ ఇబ్బందుల్లో ఉన్నారు. హోదా, దర్పం కోసం స్థాయికి మించి ఖర్చులు పెడుతున్నారు. గ్రామ/పట్టణ, మండల, నియోజక వర్గ స్థాయి నాయకులు ఆఖరుకు జిల్లా స్థాయికి ఎదిగిన వాళ్లు సైతం చేస్తున్న ఖర్చులు గుదిబండగా మారుతున్నాయి. సర్పంచ్/కౌన్సిలర్, ఎం పీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, సహకార సంఘాల చైర్మ న్లు.. లాంటి పదవులతో పాటు చోటామోటా నామి నేటెడ్ పదవులు దక్కించుకున్నవారు తాము సంపాదించేది ఏమోగానీ అడ్డగోలు ఖర్చులతో రోడ్డున పడుతున్నారు. రాజకీయాల్లో రాణించేది కొందరే. కానీ అందరూ ఆశలు పెట్టుకుంటారు. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి రూ. లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో ఓడిన వాళ్లే కాదు గెలిచిన వాళ్లు కూడా సంతోషంగా లేరని వాళ్ల ఆర్థిక స్థితిని చూస్తే స్పష్టమవుతోంది. రాజకీయాల్లో ఎదురు దెబ్బలు తిని నిలదొక్కుకున్నోళ్లు మాత్రమే ఆచితూచి ఖర్చు చేస్తున్నారు. స్టార్చ్ వేసిన తెల్లటి ఖద్దరు చొక్కా.. కాళ్లకు ఖరీదైన బూట్లు.. తిరగడానికి దొడ్డు పయ్యల కారు.. వెంట నలుగురు అనుచరులు.. జేబులో చిల్లిగవ్వ లేకున్నా పొలిటికల్ లీడర్లు ఇవన్నీ మెయింటేన్ చేయాల్సిందే...! ఎక్కడ చిన్న తేడా వచ్చినా సొంత పార్టీతో పాటు ప్రత్యర్థి పార్టీల నాయకుల ముందు చులకన అవుతామన్న భయం. అందుకే అప్పులు చేసైనా, ఆస్తులు అమ్మైనా సరే దర్పం ప్రదర్శి స్తుంటారు. అడ్డగోలు ఖర్చులతో అప్పులు కుప్పలై, ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోయి ఎంతో మంది నాయకులు రాజకీయాల నుంచి కనుమరుగవుతున్నారు. మరికొందరు అప్పులు తీర్చే మార్గం లేక, భవి ష్యత్తు కానరాక ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఇటీవలి కాలం లో జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఖద్దరు చొక్కా వెనుక కన్నీటి తడి ఎంత ఉందో ఇటీవలి సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయంలో ఓ స్థాయికి ఎదిగి, డబ్బులు సంపాదించిన వారు కార్లు మెయింటేన్ చేసేవారు. కానీఇప్పుడు

చోటా మోటా లీడర్లందరూ కార్లు కొనుగో లు చేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో ఫైనాన్స్, బ్యాంకులు కార్లకు లోన్లు ఇస్తున్నాయి. దీంతో సర్పంచ్ నుంచి మొదలుకుని ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవుల్లో ఉన్నవారు, ఓడిపోయిన వాళ్లూ, పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు. నామినేటెడ్ పదవులు పొందిన వారు దాదాపు అందరూ కార్లు మెయింటేన్ చేస్తున్నారు. కారుకు ముందూ, వెనకాల పదవి, హోదా పేరుతో రేడియం స్టిక్కర్లు అంటించుకుని, స్టీరింగు ముందు తమ పార్టీ కండువాను పరచుకుని దర్పం ప్రదర్శిస్తుంటారు.

గొప్పలకు పోయి..

రాజకీయాల్లో తిరుగుతున్నవారు నలుగురి ముందు గొప్పగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. రోజూ కార్లలో తిరగడానికి పెట్రోల్, డీజిల్ కోసం తక్కువలో తక్కువ రూ. వెయి వెచ్చించాల్సిందే. నలుగురిని వెంట వేసుకుని వెళ్లడంతో వారికి భోజనం, రాత్రికి ఇంత మందుస ర్దాల్సిందే. కనీసం రోజు ఖర్చు ఎంత లేకున్నా రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చు చేస్తారు. సరాసరిగా నెలలో వాళ్లు రూ. 40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు చేస్తున్నా రు. కొందరు అవసరముంటేనే కారు బయటకు తీస్తుండగా మెజారిటీ లీడర్లు రోజూ కారులోనే షికా రు చేస్తుంటారు. కొందరు లీడర్లు పైరవీల మీద, మరికొందరు కాంట్రాక్టుల ద్వారా డబ్బులు సంపాదిస్తుంటారు. అవి కూడా అందరికీ కలిసిరావు.

ఏదో సాధించాలనే భ్రమలో..

రాజకీయంలో ఏదో సాధిస్తామన్న భ్రమల్లో అడ్డగోలు ఖర్చులతో ఆస్తులు కరిగిపోయి అప్పులపాలై ఆత్మహ త్యలకు పాల్పడుతు న్నారు. ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. అధికార పార్టీ నాయకులంటే వాళ్లకేం తక్కువ అని అం దరూ అనుకుంటారు. కానీ చాలా మంది అప్పుల్లో కూరుకుపోయి ఉన్నట్టు తెలుస్తోంది.

తమ ఖర్చులకు తగ్గట్టుగా సంపాదన లేకపో వడం మూలంగా వాళ్లు అప్పులు చేయడం, అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముకోవడం పరిపాటిగా మారింది. ఆస్తులు పోయినా ఇం కా అప్పులు చేసి కొందరు రోడ్డున పడుతున్నారు. రాజకీయాల్లో రాణించినా అందరూ ఆర్థికంగా ఎదుగుతారని అనుకోవడం భ్రమే అవుతోందని ఓ స్థానిక ప్రజాప్రతినిధి పేర్కొన్నారు.

"మేము ఓట్లను చోరీ చేయం.. ప్రజల మనసులను గెలుచుకుంటాం"

- ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలు, రాజ్యాంగ వ్యవస్థలపై బురదజల్లడం కాంగ్రెస్ నైజం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి*

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 27:

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తొలుత భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయినందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి, పోలీస్, మున్సిపల్ సిబ్బందికి, ప్రభుత్వ యంత్రాంగానికి, సహకరించిన నగర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికల సంఘం, రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిరాధార ఆరోపణలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చాలా బాగా పనిచేసినట్లు, కేరళలో కాంగ్రెస్ సీనియర్ నేత చెప్పినట్లు ఎస్ఐఆర్ (SIR) ద్వారా దొంగ ఓట్లను తొలగిస్తే ఈసీ మంచిదైనట్లు ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. అదే ఇతర రాష్ట్రాల్లో బీజేపీ గెలిస్తే మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘం తప్పున్నట్లు మాట్లాడటం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది కాదని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలది కాదని స్పష్టం చేశారు.రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించి, పత్రికా స్వేచ్ఛను హరించి, పౌర హక్కులను కాలరాసి, ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టి చీకటి రాజ్యాన్ని నడిపిన చరిత్ర కాంగ్రెస్‌దని నిలదీశారు. 2009లో తమ మాట వినడం లేదని ఏకంగా రాజ్యాంగబద్ధ ఎన్నికల కమిషనర్లను తొలగించాలని రాష్ట్రపతికి సిఫారసు చేసిన చరిత్రను గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజాస్వామ్య బద్ధంగా ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేయాలన్నా కోర్టులకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉందని, అలాంటి వారు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మరోవైపు తెలంగాణ ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు వెళ్లి "సోనియా గాంధీ కుటుంబం కోసం ప్రాణాలు అర్పిస్తా" అనడం సిగ్గుచేటని, ప్రజల సమస్యలను గాలికొదిలేసి గాంధీ కుటుంబ సేవలోనే గడుపుతున్నారని ఆక్షేపించారు. దేశ ప్రయోజనాల కోసం పని చేస్తున్న రాజ్యాంగ, భద్రతా వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. "రాహుల్ గాంధీ ఏ ఒక్క వ్యవస్థనూ వదిలిపెట్టడం లేదు. ఆర్మీ చీఫ్, ఎయిర్‌ఫోర్స్, సర్జికల్ స్ట్రైక్స్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సీజేఐ, ఈడీ, సీబీఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, మీడియా హౌస్‌లతో పాటు చివరకు పార్లమెంట్, జీఎస్టీ వ్యవస్థలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ విషప్రచారం చేస్తున్నారు. విదేశీ వేదికల మీద దేశ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం ఆయన రాజకీయ అవగాహనారాహిత్యానికి నిదర్శనం" అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. "ఈ దేశాన్ని మా కుటుంబం మాత్రమే పాలించాలి, తమ తాత, నానమ్మ, తండ్రి ప్రధానులయ్యారు కాబట్టి నేనే ప్రధాని కావాలనే రాచరికపు భావజాలం, అహంకారం రాహుల్ గాంధీ మాటల్లో స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రధాని శ్రీ నరేంద్ర

మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజల మధ్యే ఉంటూ సుపరిపాలన అందిస్తోందని తెలిపారు. దేశంలో పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పన, ఉచిత రేషన్, రహదారులు, ఎయిర్‌పోర్టులు, మహిళా సంఘాలకు ప్రోత్సాహం వంటి ఎన్నో పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చామని పేర్కొన్నారు. గత 11–12 ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వంపై ఒక్కటంటే ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని, గత యూపీఏ పాలన అంతా కుంభకోణాల మయంగా సాగిందని ఎద్దేవా చేశారు. స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వాన్ని (Stable Government & Able Leadership) ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టే బీజేపీని పదే పదే ఆశీర్వదిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఉత్తరప్రదేశ్‌లో 1989 నుంచి, బీహార్‌లో 1990 నుంచి, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి, గుజరాత్‌లో 1998 నుంచి, ఏపీలో 2009 నుంచి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అడ్రస్సే లేకుండా చేశారని గుర్తుచేశారు. అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్థిక సంక్షోభం సృష్టించి, చివరకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి తీసుకొచ్చారని, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) గురించి మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు, పర్యవేక్షణలోనే లక్షలాది అక్రమ ఓట్లను తొలగించడం జరుగుతోందని తెలిపారు. "బెంగాల్‌లో చనిపోయిన 24 లక్షల మంది ఓట్లు, పర్మనెంట్‌గా వలస వెళ్లిన 19 లక్షల మంది ఓట్లు, చిరునామా లేని 12 లక్షల మంది ఓట్లు, దాదాపు 2 కోట్ల డూప్లికేట్ ఓట్లు తొలగిస్తే తప్పేముంది? తండ్రికి, పిల్లలకు మధ్య కేవలం 15 ఏళ్ల వయస్సు తేడా ఉన్నట్లు చూపించిన తప్పుడు రికార్డులను సవరిస్తే కాంగ్రెస్‌కు వచ్చిన ఇబ్బందేమిటి?" అని ప్రశ్నించారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దితే స్వాగతించాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం మానుకోవాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలు – కేంద్ర మంత్రి సమాధానాలు:

- **ప్రశ్న: ఎన్నికల కమిషన్ సభ్యుల మధ్య విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలపై మీ స్పందన ఏమిటి?**
- **సమాధానం: ప్రజాస్వామ్యంలో లేఖలు రాయడం, అంతర్గతంగా చర్చించుకోవడం సహజం. నిన్న ముగ్గురు ఎన్నికల కమిషనర్లు స్వయంగా సమావేశమై తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టత ఇచ్చారు. దాంతో ఆ అంశం ముగిసిపోయింది. దీనిపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదు.**
- **ప్రశ్న: దేశంలో మత సామరస్యం, శాంతిభద్రతల పరిస్థితిపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై మీరేమంటారు?**
- **సమాధానం: కాంగ్రెస్ హయాంలో దేశంలో ఎక్కడ చూసినా కర్ఫ్యూలు, బాంబు పేలుళ్లు, మతకలహాలు నిత్యకృత్యంగా ఉండేవి. ప్రధాని మోదీ గారి నేతృత్వంలో గత 12 ఏళ్లుగా హైదరాబాద్, ముంబై, బెంగళూరు సహా దేశంలోని ఏ ఒక్క ప్రధాన నగరంలోనూ అలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జీవిస్తున్నారు.**
- **ప్రశ్న: ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎలా చూస్తారు?**
- **సమాధానం: ఇది సుప్రీంకోర్టు ఆదేశాలు, పర్యవేక్షణలోనే జరుగుతున్న ప్రక్రియ. చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు, తప్పుడు వివరాలతో ఉన్న ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా తీర్చిదిద్దడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. కేరళ, తమిళనాడులో గెలిస్తే ఈ ప్రక్రియ మంచిదని, బెంగాల్, ఇతర రాష్ట్రాల్లో తప్పు పట్టడం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.**

భవిష్యత్ ప్రధానిగా రాహుల్ వైపే దేశం చూపు

నేరేడుచర్ల, వెలుతురు సెప్టెంబర్ 27:

పదవుల కోసం రాజీపడకుండా, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. పార్లమెంట్ నుంచి ప్రజాక్షేత్రం వరకు, విద్యార్థుల నుంచి రైతుల వరకు, కార్మికుల నుంచి నిరుద్యోగ యువత వరకు ప్రతి వర్గం ఆవేదనకు రాహుల్‌గాంధీ గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు."రాహుల్‌గాంధీని మౌనం చేయాలని ప్రయత్నించిన ప్రతిసారీ ఆయన గొంతు మరింత శక్తివంతమైంది. ఆయన అడుగులను అడ్డుకోవాలని చూసిన ప్రతిసారీ దేశ ప్రజలు ఆయనకు మరింత దగ్గరయ్యారు. రాజకీయ వేధింపులను ఎదుర్కొని నిలబడిన ఆయన ధైర్యమే నేడు దేశానికి భరోసాగా మారింది" అని మంత్రి వ్యాఖ్యానించారు.కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండటం, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు భద్రంగా ఉండటం, ప్రజాస్వామ్య సంస్థలు రాజకీయ ఒత్తిడులకు అతీతంగా పనిచేయడం, ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ఉండటం, పౌరులు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగడం–ఇవన్నీ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులని అన్నారు. ఓటరు జాబితాలు, ఎన్నికల నిర్వహణ, ఓట్ల భద్రతపై రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు దేశ ప్రజల అనుమానాలకు ప్రతిధ్వనిగా నిలిచాయని చెప్పారు. "ఓట్ చోరీ" అంశాన్ని దేశం ముందుంచి ప్రజాస్వామ్య వ్యవస్థల నుంచి జవాబుదారీతనాన్ని కోరడం తప్పుకాదన్నారు. ఎన్నికల ప్రక్రియపై తీవ్రమైన సందేహాలు వ్యక్తమైనప్పుడు వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయకుండా, పారదర్శకంగా ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉందని స్పష్టం చేశారు.ఢిల్లీ ఓటరు జాబితాల సవరణకు సంబంధించిన నోటీసులపై సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రశ్నలను ప్రస్తావిస్తూ, ఓటర్ల హక్కులకు సంబంధించిన ప్రతి ప్రక్రియ స్పష్టంగా, నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా ఉండాలన్నారు. అర్హుడైన ఒక్క పౌరుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకూడదని, ప్రతి ఓటుకూ సమాన విలువ దక్కాలని పేర్కొన్నారు. విమర్శను శత్రుత్వంగా, భిన్నాభిప్రాయాన్ని దేశద్రోహంగా చిత్రీకరించే ప్రమాదకర రాజకీయ సంస్కృతిని బీజేపీ పెంచిపోషిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం, స్వతంత్ర సంస్థలపై ఒత్తిడి పెంచడం, రాజ్యాంగబద్ధ వ్యవస్థలను బలహీనపరచడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమన్నారు. "అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం నేరం కాదు–ప్రజాస్వామ్యం ప్రసాదించిన హక్కు. ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రతిపక్షాల రాజ్యాంగబద్ధమైన కర్తవ్యం. పార్లమెంట్‌లో చర్చకు తలుపులు మూసి, ప్రశ్నించే గొంతులను అణచివేసి, సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం ప్రజాస్వామ్యం కాదు. అది నియంతృత్వానికి దారితీసే ప్రమాదకర ధోరణి" అని ఆయన హెచ్చరించారు.రాజ్యాంగం కేవలం ఒక గ్రంథం కాదని, కోట్లాది భారతీయుల హక్కులు, ఆశలు, ఆత్మగౌరవానికి అది జీవన పత్రమని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆ రాజ్యాంగాన్ని కాపాడే చారిత్రక బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్, దేశాన్ని నిర్మించిన కాంగ్రెస్, ప్రజాస్వామ్యాన్ని బలపరిచిన కాంగ్రెస్ మాత్రమే నేడు రాజ్యాంగాన్ని రక్షించి దేశ సమగ్రతను నిలబెట్టగలదని చెప్పారు."బీజేపీ అధికారాన్ని కేంద్రీకరిస్తే–కాంగ్రెస్ అధికారాన్ని ప్రజలకు చేరువ చేస్తుంది. బీజేపీ భయాన్ని పెంచితే–కాంగ్రెస్ భరోసా కల్పిస్తుంది. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తే–కాంగ్రెస్ దేశాన్ని ప్రేమ, సామరస్యం, సోదరభావంతో ఒక్కటిగా నిలబెడుతుంది. అందుకే రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం; ప్రజాస్వామ్య పరిరక్షణ రాహుల్‌గాంధీ నాయకత్వంతోనే సాధ్యం" అని మంత్రి ఉద్ఘాటించారు.విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగ యువత, సామాన్య కుటుంబాలతో రాహుల్‌గాంధీ నిరంతరం మమేకమవుతున్నారని చెప్పారు. ఇండోర్‌లో జరిగిన "ఛాత్రోంకీ గూంజ్" కార్యక్రమంలో యువతతో ఆయన జరిపిన సంభాషణ, కొత్తతరం ఆకాంక్షలను వినే నాయకుడిగా రాహుల్‌గాంధీని మరోసారి దేశానికి పరిచయం చేసిందన్నారు. ప్రజల మధ్య నడుస్తూ, వారి కన్నీటిని తుడుస్తూ, వారి కష్టాలను తన పోరాటంగా మార్చుకున్న నాయకుడే దేశానికి ఇప్పుడు అవసరమని పేర్కొన్నారు.రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్న జాతీయ సంకల్పానికి తెలంగాణ నాయకత్వం వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. "తెలంగాణలోని ప్రతి లోక్‌సభ స్థానాన్ని గెలిచి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడంలో నిర్ణయాత్మక పాత్ర పోషిద్దాం. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యత, క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగాలి. ప్రతి గ్రామం కాంగ్రెస్ కోటగా, ప్రతి కార్యకర్త రాజ్యాంగ పరిరక్షణ సైనికుడిగా మారాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ ప్రత్యర్థుల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందిస్తూ సమయం వృథా చేయకుండా, ప్రజల సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారం, పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను వివరించడంతోపాటు, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్న సమానత్వ, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. "దేశానికి ఇప్పుడు అధికార మదంతో వ్యవహరించే పాలకుడు కాదు–ప్రజల బాధను వినగల నాయకుడు కావాలి. ప్రశ్నలను అణచివేసే ప్రభుత్వం కాదు–ప్రతి గొంతుకకు విలువనిచ్చే ప్రభుత్వం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూసే శక్తులు కాదు——దానిని ప్రాణప్రదంగా కాపాడే కాంగ్రెస్ కావాలి. ఆ ప్రజాస్వామ్య భారతానికి రాహుల్‌గాంధీ నాయకత్వం వహించాలి. భవిష్యత్ ప్రధానమంత్రిగా ఆయనను స్వాగతించేందుకు దేశం సిద్ధంగా ఉంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ
ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి: మంత్రి పొన్నం ప్రభాకర్

- తెలంగాణ కోసం పదవిని త్యాగం చేసిన మహనీయుడు
- బలహీన వర్గాలు ఐక్యంగా ఉండాలి.. సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి

హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 27:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పోరాటం, త్యాగం, ప్రజాసేవకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై బాపూజీ చిత్రపటానికి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు, రాజకీయ భవిష్యత్తు కంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యత ఇచ్చిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. సామాజిక అసమానతలు, వెట్టిచాకిరీ వంటి దోపిడీకి వ్యతిరేకంగా కూడా బాపూజీ పోరాటం చేశారని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము ఎంపీలుగా ఉన్నప్పుడు బాపూజీ ఆశయాలు, పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శంగా నిలిచాయని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చేనేత కార్మికులు, నేతన్నల అభివృద్ధి, సంక్షేమం కోసం బాపూజీ చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తుల్లో మార్పులు

బలహీన వర్గాలు ఐక్యంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయ కుల వృత్తుల్లోనూ అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పద్మశాలి సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, వచ్చే ఎన్నికల్లో ఐదుగురు పద్మశాలి ఎమ్మెల్యేలు గెలవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇటీవల యాదవ, ముదిరాజ్ వర్గాల సమావేశాలు జరిగాయని, తాజాగా పద్మశాలి సమావేశం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అన్ని బలహీన వర్గాలు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగాలని సూచించారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా చట్టపరమైన చర్యలు తీసుకుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించి సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ వెనుకబాటుతనంపై ప్రామాణిక డేటా సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటే అంశంలో ప్రామాణిక డేటా అవసరమని కోర్టులు పేర్కొన్న నేపథ్యంలో, దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త జనగణనలో కులగణన చేపట్టనున్నట్లు ప్రకటించినప్పటికీ, బీసీలకు సంబంధించిన సమగ్ర వివరాల సేకరణపై స్పష్టత అవసరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే ఇప్పటికే రాష్ట్ర విధాన చర్చల్లో ప్రస్తావించబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు గూడూరి శ్రీనివాస్, అనిల్ ఈరవత్రి, మెట్టు సాయికుమార్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో
సత్తా చాటిన తెలంగాణ యువత

- లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వార్డింగ్ విభాగంలో మెహ్రున్నిసాకు సిల్వర్ మెడల్
- క్యాబినెట్ మేకింగ్‌లో కె. యశ్వంత్ చారికి Medal of Excellence
- తెలంగాణ నుంచి ముగ్గురు పోటీల్లో పాల్గొనగా.. ఇద్దరికి పతకాలు
- తెలంగాణ యువత విజయంపై మంత్రి వివేక్ వెంకటస్వామి అభినందనలు

షాంఘై, వెలుతురు సెప్టెంబర్ 27:

చైనాలోని షాంఘైలో జరిగిన WorldSkills Competition 2026లో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. తెలంగాణ నుంచి ముగ్గురు పోటీలో పాల్గొనగా లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వార్డింగ్ విభాగంలో మెహ్రున్నిసా సిల్వర్ మెడల్, క్యాబినెట్ మేకింగ్ విభాగంలో కె. యశ్వంత్ చారి Medal of Excellence సాధించారు. తెలంగాణ యువత ప్రపంచస్థాయి నైపుణ్య పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచడం పట్ల శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. మెహ్రున్నిసా, కె. యశ్వంత్ చారిని మంత్రి అభినందించారు. ప్రపంచ వేదికపై తెలంగాణకు గుర్తింపు తీసుకురావడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. వరల్డ్ స్కిల్స్ షాంఘై–2026లో భారత్ 10వ స్థానంలో నిలిచి ఆరు సిల్వర్ మెడల్స్, 20 Medal for Excellence అవార్డులు సాధించడం విశేషమని మంత్రి తెలిపారు. గతంలో 2024లో ఫ్రాన్స్‌లో జరిగిన వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో భారత్ 13వ స్థానంలో నిలవగా.. ఈసారి 10వ స్థానంలో నిలవడం దేశ యువత నైపుణ్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. భారత్ తరపున 70 మంది పోటీదారులు 63 నైపుణ్య విభాగాల్లో పాల్గొన్నారు.ఆధునిక సాంకేతికత, అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్, డిజిటల్, క్రియేటివ్, సర్వీస్ రంగాలకు చెందిన విభాగాల్లో భారత యువత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తమ ప్రతిభను ప్రదర్శించిందన్నారు.తెలంగాణ నుంచి పాల్గొన్న ముగ్గురిలో ఇద్దరు అంతర్జాతీయ స్థాయిలో పతకం, గుర్తింపు సాధించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మెహ్రున్నిసా సాధించిన సిల్వర్ మెడల్, కె. యశ్వంత్ చారి సాధించిన తెలంగాణ యువత నైపుణ్యానికి నిదర్శనమని తెలిపారు. గత వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో తెలం గాణకు కాంస్య పతకం లభించగా.. ఈసారి సిల్వర్ మెడల్‌తో పాటు సాధించడం ద్వారా తెలంగాణకు గర్వకారణమని మంత్రి వివేక్ అన్నారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, నైపుణ్యం ఉందని మంత్రి అన్నారు. వారికి అత్యుత్తమ శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలతో అనుసంధానం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన అవకాశాలు కల్పిస్తే పోటీల్లో మరిన్ని విజయాలు సాధించగలరని తెలిపారు.నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, యువతను భవిష్యత్ ఉపాధి అవకాశాలకు, అంతర్జా తీయ పోటీకి సిద్ధం చేస్తున్న కార్యక్రమాలకు ఈ విజయాలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని మంత్రి తెలిపారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com